ఆంధ్రజ్యోతి 5 ప్రకాశం

సోమవారం 16, డిసెంబరు 2024

ఆ స్తు లు న్నా అంతస్తులు ఉండవు!

- కోటీశ్వరులైనా ఇంటి పై అంతస్తు నిర్మించరు
- ఊరి కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి కంటే ఎక్కువ ఎత్తులో ఉండకూడదని కట్టుబాటు
- ఏళ్ల తరబడి నియమాన్ని పాటిస్తున్న గ్రామస్థులు
- రాష్ట్రంలోనే పైఅంతస్తులేని గ్రామంగా విశిష్టతను చాటుకుంటున్న పాతసింగరాయకొండ



కాస్త ఆదాయం ఎక్కువగా ఉంటే చాలు అంతస్తుపై అంతస్తును కట్టేస్తారు. కొందరు దర్పం కోసం భవంతిపై భవంతిని నిర్మిస్తారు. పట్టణాల్లోనే కాదు పల్లెల్లోనూ ఇదే ధోరణి పెరిగింది. ఇప్పుడు ఏ గ్రామంలో చూసినా జీప్లస్ ఇళ్లు అనేకం కనిపిస్తాయి. కానీ.. ఆ ఊరు మాత్రం అందుకు పూర్తి భిన్నం. ఆ గ్రామమే సింగరాయకొండ మండలంలోని పాతసింగరాయకొండ. అక్కడ ఎవరూ తమ ఇంటిపై మరో అంతస్తు వేయరు. ఊరు మొత్తం అనాదిగా ఇదే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. దీనికి కారణం తమ ఊరి కొండపై ఉన్న వరాహ లక్ష్మీనరసింహస్వామి కంటే ఎక్కువ ఎత్తులో ఎవరూ ఉండకూడదన్న కట్టుబాటు. స్వామివారి కంటే తక్కువ ఎత్తులో ఉంటే చల్లగా ఉంటామని గ్రామస్థుల విశ్వాసం.

- వివరాలు 7వ పేజీలో

సబ్ జైలులో జిల్లా న్యాయాధికారి తనిఖీ

ఖైదీలు ఉండే గదులు, సదుపాయాల పరిశీలన



సబ్ జైలును తనిఖీ చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి భారతి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్ జైలును ఆదివారం జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎ.భారతి తనిఖీ చేశారు. విచారణలో ఉన్న ఖైదీలు ఉండే గదులను, సదుపాయాలను పరిశీలించారు. సరుకులను, వాటి నాణ్యతను చూశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసుల నుంచి బయటకు వచ్చిన వారు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకొనే ఆర్థిక స్థోమత లేనివారు మండల న్యాయ సేవాధికార సంస్థకు అర్జీ పెట్టుకోవాలన్నారు. బెయిల్, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.శ్యాంబాబు, స్థానిక జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి ఎ.ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.మేరీసారాదానమ్మ, సబ్ జైలు సూపరింటెండెంట్ యు.లింగారెడ్డి, లీగల్ ఎయిడ్ న్యాయవాది రవిప్రకాశ్‌బాబు, పారాలీగల్ వలంటీర్ మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

కంభం సీఐ ఫోన్ హ్యాక్

ఆయన నంబరు నుంచి వచ్చే సందేశాలకు స్పందించొద్దు

ఎస్సై నరసింహారావు సూచన

కంభం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సామాన్యులు, ఉద్యోగులు అనే భేదం లేకుండా అన్ని వర్గాల వారినీ మోసం చేస్తున్నారు. న్యాయం కోసం పోలీస్‌స్టేషన్లకు వెళ్లే బాధితులు పెరిగిపోతున్న క్రమంలో పోలీసులు కూడా బాధితులుగా మిగిలిపోతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. అలాంటి పరిస్థితే ఇప్పుడు జిల్లాలోని కంభం సీఐ మల్లికార్జునరావుకు ఎదురైంది. ఆయన ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. ఈ మేరకు ఎస్సై నరసింహారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన సెల్ నుంచి వచ్చిన సందేశాల లింకులను ఎవరైనా క్లిక్ చేస్తే వారి సెల్‌ఫోన్ కూడా హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఆయన సెల్ నుంచి వచ్చే సందేశాలు ఎవరు ఓపెన్ చేసినా వారి ఖాతాల నుంచి కూడా డబ్బులు పోయే ప్రమాదం ఉందని ఎస్సై హెచ్చరించారు.

శిరస్త్రాణమే శిరోధార్యం

- ఏడాదిలో 112 ద్విచక్ర వాహన యాక్సిడెంట్లు
- హెల్మెట్ లేక ప్రాణాలు కోల్పోయిన వారు 85 మంది
- వాటి నివారణకు అధికారుల చర్యలు నామమాత్రం
- 62,900 మందికి జరిమానాతో సరి
- పటిష్ఠమైన చర్యలతోనే ప్రమాదాల నివారణ

ఆందోళన కలిగిస్తున్న ద్విచక్రవాహన ప్రమాదాలు

ఒంగోలు క్రైం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. వీటిలో ద్విచక్ర వాహనదారులవి అధికంగా ఉంటున్నాయి. వాటిలోనూ హెల్మెట్ లేకుండా వెళ్లడం వల్ల జరిగిన ప్రమాదాలు ఎక్కువగా ఉన్నాయి. నిబంధనలు పాటించకపోవడంతో కొందరు రోడ్డు ప్రమాదాల బారినపడి ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ఏడాదిలో 60 ద్విచక్రవాహన ప్రమాదాల్లో 85 మంది మృతి చెందడం అత్యంత బాధాకరం. ఈ ప్రమాదాలన్నీ హెల్మెట్ ధరించకపోవడం వల్లే జరిగాయి. వీటివల్ల బంగారు భవిష్యత్తు ఉన్న బిడ్డలను పోగొట్టుకున్న తల్లిదండ్రులు, భర్తలను కోల్పోయిన భార్యలు ఒంటరైపోతున్నారు. ఈ క్రమంలో ఇటీవల కేంద్ర మోటార్ సవరణ చట్టం అమలు చేయడం లేదని కోర్టు అధికారులకు అక్షింతలు వేసింది. అయినా హెల్మెట్ ధరించని వారిపై అధికారుల చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి.

పెట్రోల్‌కు వచ్చి..

పామూరు మండలం నుచ్చుపొదకు చెందిన పారిశ్రామికవేత్త దేవరపు హనుమంతరావు (62) కొద్ది రోజుల క్రితం గ్రామ సమీపంలోని బంకులో పెట్రోలు కొట్టించుకొని ఇంటికి బయల్దేరారు. జాతీయ రహదారిపై గేదెలు ఒక్కసారిగా అడ్డురావడంతో వాటిని ఢీకొని కిందపడిపోయారు. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు.

రైల్వేస్టేషన్‌కు వెళ్తూ..

మార్కాపురం పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీకి చెందిన అన్నదమ్ములు కార్తీక్, యశ్విన్‌లు ఈ నెల 10వ తేదీన రాయవరం సమీపంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నారు. రైల్వే ఓవర్ బ్రిడ్జిపై వీరు ప్రయాణిస్తున్న మోటార్ సైకిల్ అదుపు తప్పింది. యశ్విన్ (16) తలకు తీవ్ర గాయమవడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు.





ఇంటికెళ్తూ..

పెద్దారవీడు మండలం ఓబులక్కపల్లి గ్రామానికి చెందిన దుగ్గెంపూడి వెంకటరెడ్డి (54) భార్యతో కలిసి గత నెల 25న మోటార్ సైకిల్‌పై హనుమాన్ జంక్షన్ కుంట నుంచి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన బైకు ఢీ కొట్టింది. దీంతో తలకు బలమైన గాయమైంది. వైద్యం కోసం ఒంగోలు రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతిచెందాడు. ఇవి హెల్మెట్ లేకపోవడంతో ప్రాణాలు కోల్పోయిన వారికి సంబంధించి మచ్చుకు ఉదాహరణలు మాత్రమే.. ఇలాంటివి అనేకం జరిగాయి.

60 ప్రమాదాల్లో 85 మంది మృతి

డ్రైవింగ్ లైసెన్సులు లేకుండా మైనర్లు వాహనాలు నడపడం, హెల్మెట్ లేకుండా వాహనచోదన చేయడం, మద్యం సేవించి మోటార్ సైకిల్ నడిపి ప్రాణాలు పోగొట్టుకోవడం లాంటి ప్రమాదాలు పెరిగిపోతున్నాయి. సరాసరి నెలలో ఏడుగురు ద్విచక్రవానదారులు హెల్మెట్ లేని కారణంగా మృతిచెందినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వీటిని నివారించడంలో పోలీసు, రవాణా శాఖ అధికారుల నిర్లిప్తత కనిపిస్తోంది. పోలీసులు ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్‌లు లేనివారిపై కేసులు నమోదు లాంటి చర్యల పటిష్ఠంగా అమలు చేస్తే ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని హైకోర్టు అభిప్రాయపడింది. మోటార్ సైకిళ్లపై ప్రయాణించే వారిలో ఎక్కువగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వారే ఉంటున్నారు. ఆ కుటుంబాల్లో రోడ్డు ప్రమాదానికి గురై యజమాని మృతి చెందితే సభ్యుల జీవనం దుర్భరంగా మారుతోంది. ఏడాది కాలంలో జిల్లా వ్యాప్తంగా ద్విచక్ర వాహన రోడ్డు ప్రమాదాలు 112 జరిగితే వాటిలో హెల్మెట్ లేని ప్రమాదాలు 60 ఉన్నాయి. వీటిలో 85 మంది మృతి చెందారు. ట్రిపుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా నడపడం వల్ల జరిగిన ప్రమాదాలు సైతం అధికంగానే ఉన్నాయి. ఇలాంటి వారిపై పోలీసు, రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకుంటే అనేకమంది ప్రాణాలు నిలబడేవి.

హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే చర్యలు

హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపే వారిపై ప్రత్యేక దృష్టి సారించాం. ఈ ఏడాది ఇప్పటికే 62,900 మందికి జరిమానా విధించాం. పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ఇకపై కఠిన చర్యలు తీసుకుంటాం.

- పాండురంగారావు, ట్రాఫిక్ సీఐ, ఒంగోలు

బైక్ ప్రమాదాల్లో కొన్ని..

- పొదిలిలోని నిర్మలా కాలనీకి చెందిన కోలా రాజ (38) పామూరులోని విరాట్‌నగర్‌లోని అత్తవారింట్లో జరిగే శుభకార్యానికి బైక్‌పై వెళుతూ గుమ్మళంపాడు సమీపంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొన్నాడు. దీంతో ఆయన ఎగిరి రోడ్డుపై పడటంతో తలపగిలి అక్కడికక్కడే మృతి చెందారు.
- మద్దిపాడు మండలం లింగంగుంట గ్రామానికి చెందిన పిల్లి కుషాల్ (18) ఒంగోలు సమీపంలోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. అదే కాలేజీలో ఆయన తల్లికూడా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. గత నెలలో తల్లీకొడుకులు ద్విచక్ర వాహనంపై కాలేజీకి బయల్దేరారు. ఒంగోలు దక్షిణ బైపాస్‌కు సమీపంలో ఆగి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొనడంతో కుషాల్ అక్కడికక్కడే మృతి చెందారు.
- మద్దిపాడు మండలం పెదకొత్తపల్లి అంజయ్యనగర్‌కు చెందిన పూనూరి బాలచంద్ (32) ఒంగోలులోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రాత్రి ఇంటికి వెళ్తూ దొడ్డవరం పెట్రోలు బంకు సమీపంలో ముందు వెళ్తున్న ట్రావెల్స్ బస్సును ఢీకొట్టాడు. దీంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందారు.
- ఎర్రగొండపాలేనికి చెందిన మహ్మద్‌నూర్, మొగలి అఫ్రోజ్ బేగ్ వ్యక్తిగత పని నిమిత్తం బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తూ కొత్తపల్లి మలుపు వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరూ మృతి చెందారు. నెలక్రితం ఈ ఘటన చోటుచేసుకుంది.
- జనవరి 1న బేస్తవారపేట పరిధిలో లారీని మోటార్ సైకిల్ ఢీ కొట్టడంతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.
- మే 25న కనిగిరి పోలీసుస్టేషన్ పరిధిలో రెండు మోటర్ సైకిళ్లు ఢీకొని ముగ్గురు మృతి చెందారు.
- నవంబరు 17న కొప్పోలు సమీపంలో వెనుక నుంచి ట్రాక్టర్, ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ముగ్గురు బాలురు చనిపోయారు.

పేదలు, రైతుల సంక్షేమమే ధ్యేయం

- ప్రతి హామీని నెరవేరుస్తున్నాం
- వసతి గృహాల్లో సౌకర్యాలు మెరుగు
- త్వరలో కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు
- ఐదేళ్లు ప్రజలను దగా చేసి ఇప్పుడు వైసీపీ ధర్నాలు చేయడం సిగ్గుచేటు
- మంత్రి డాక్టర్ స్వామి



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : పేదలు, రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. అందుకు కట్టుబడి పనిచేస్తున్నదని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. ఐదేళ్లుగా అన్ని వర్గాల ప్రజలను దగా చేసి ఇప్పుడు రైతుల పేరుతో వైసీపీ ధర్నాలకు దిగడం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. ఇలా ఎందుకు చేస్తున్నారో ఆ పార్టీ వారికి కూడా తెలియదని ఎద్దేవా చేశారు. ఆదివారం ఒంగోలులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తుంటే చూసి ఓర్చుకోలేక వైసీపీ కుటిల రాజకీయం చేస్తున్నదని స్వామి మండిపడ్డారు. జగన్‌కు గత ఎన్నికల్లో ప్రజలు బుద్ధిచెప్పినా జ్ఞానోదయం కలగలేదన్నారు. ఇలాగే వ్యవహరిస్తే వైసీపీకి పుట్టగతులుండవని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పది, ఇంటర్‌లో మరింత మెరుగైన ఫలితాల సాధన దిశగా దృష్టి సారించామని మంత్రి స్వామి చెప్పారు. విద్యార్థులను వారి ప్రతిభ ఆధారంగా కేటగిరీలుగా విభజించి అవసరమైన బోధన అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వసతి గృహాల్లో సౌకర్యాలను మెరుగుపరుస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. హాస్టళ్లలో ఉండి చదువుకుంటున్న వారిలో 60 మంది ఈ ఏడాది ఐఐటీ, నీట్‌లలో ప్రవేశం పొందారని గుర్తు చేశారు. సామాజిక పింఛన్లలో అనర్హులను తొలగిస్తామని మంత్రి పునరుద్ఘాటించారు. త్వరలో కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు మంజూరు చేస్తామన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

అమరజీవికి మంత్రి డాక్టర్ స్వామి నివాళి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. ఆయన పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం ఎదురు ఉన్న విగ్రహానికి కలెక్టర్ తమీమ్ అన్సారియా, మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీతో కలిసి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పొట్టి శ్రీరాములు ఆత్మార్పణతో మద్రాసు నుంచి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటైందన్నారు. రాష్ట్రం కోసం మాత్రమే కాకుండా దళితులకు దేవాలయ ప్రవేశాలు, స్వాతంత్ర్యోద్యమంలో ఆయన చేసిన పోరాటాలు స్ఫూర్తిదాయకమన్నారు. తెలుగు వారు అభివృద్ధి చెందాలని, ప్రత్యేక గుర్తింపు ఉండాలన్న శ్రీరాములు ఆశయ సాధన దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ప్రభుత్వం ముందుకు సాగుతున్నదన్నారు. కలెక్టర్ అన్సారియా మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో శ్రీరాములు నిస్వార్థ పోరాటయోధునిగా గాంధీజీ నుంచి ప్రశంసలు అందుకున్నారన్నారు. తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం ఆయన చేసిన ప్రాణత్యాగంతో రాష్ట్రం ఏర్పడిందన్నారు. దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు అదే పునాది అయ్యిందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో చినఓబులేశు, ఆర్డీవో లక్ష్మీప్రసన్న, వివిధ శాఖల అధికారులు అంజల, వెంకటేశ్వరరావు, కిరణ్‌కుమార్, కార్పొరేషన్ కమిషనర్ వెంకటేశ్వరరావు, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి వైసీ యోగయ్య యాదవ్, టీడీపీ నాయకురాలు తమ్మిశెట్టి రమాదేవితోపాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా

అయ్యో అమ్మ..!



నడిరోడ్డుపై ఉన్న వృద్ధురాలు

పట్టించుకోని కొడుకులు

చలికి వణుకుతూ నడిరోడ్డుపై నరకం

గ్రామస్థులు పెట్టే భోజనంతోనే కడుపు నింపుకుంటున్న వృద్ధురాలు

కొమరోలు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వృద్ధాప్యంలో కుటుంబ సభ్యుల ఆసరా కరువై ఓ వృద్ధురాలు నడిరోడ్డుపై బతుకీడుస్తోంది. చలికి వణుకుతూ దీనావస్థలో కొట్టుమిట్టాడుతోంది. అందిన సమాచారం మేరకు.. కొమరోలు మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన ఇండ్ల వెంకట లక్ష్మమ్మ (75)కు ముగ్గురు కుమారులు ఉన్నారు. భర్త ఆరేళ్ల క్రితం మృతి చెందారు. కుటుంబ ఆస్తులను కుమారులు పంచుకున్నారు. ఈమె కోసం ఎకరం పొలం, చిన్న పూరి పాక కేటాయించారు. ప్రభుత్వ పింఛన్ వస్తుండడంతో దాన్ని ఇప్పటి వరకు కుమారులే తీసుకుంటూ తలా కొన్నాళ్లు భోజనం పెట్టారు. ఇప్పుడు వయసు పైబడటంతో ఆలనాపాలనా చూడడానికి కుటుంబ అవసరం వచ్చింది. అయితే ముగ్గురు కుమారులు కొమరోలు చుట్టుపక్కల గ్రామాల్లోనే స్థిరపడినా ఆమెను నిర్లక్ష్యం చేశారు. ఉన్న పూరి పాక కూడా శిథిలం కావడంతో లక్ష్మమ్మ రోడ్డుపైకి వచ్చింది. 20 రోజులుగా ఎముకలు కొరికే చలిలో రోడ్డుపై వృద్ధురాలు ఉండడం గ్రామస్థులను సైతం కలచివేసింది. ఆమె దుస్థితిపై కుమారులకు సమాచారం ఇచ్చినా వారి నుంచి సరైన స్పందన రాలేదని తెలిసింది. దీంతో ఆమె ఆకలి అన్నప్పుడు గ్రామస్థులే భోజనం అందిస్తున్నారు.

ఉల్లిపాయల వ్యాపారి ఆత్మహత్యాయత్నం



ట్యాంకుపైకి ఎక్కిన చిరంజీవిరెడ్డి

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని దామోదర సంజీవయ్య కూరగాయల మార్కెట్‌లో ఉల్లిపాయల వ్యాపారం చేసే చిరంజీవి రెడ్డి ఆత్మహత్య చేసుకుంటానని కార్పొరేషన్ అధికారులను బెదిరింపులకు పాల్పడ్డాడు. స్థానిక మార్కెట్‌లో రోడ్డుపై ఆక్రమణలు తొలగించే క్రమంలో భాగంగా అధికారులు ఇటీవల చర్యలు చేపట్టారు. అందులో భాగంగా షాపు లీజుదారులు ఎవరి దుకాణాల్లో వారు వ్యాపారాలు చేసుకోవాలని ఆదేశించారు. ఇదే మార్కెట్‌లో ఉల్లిపాయల వ్యాపారం చేసే చిరంజీవిరెడ్డి తన షాపు తొలగించడానికి వీల్లేదంటూ అడ్డం తిరిగాడు. పలుమార్లు అధికారులు హెచ్చరించినా పట్టించుకోని ఆయన ఆదివారం సమీపంలోని వాటర్ ట్యాంకర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. ఈ వ్యాపారి గతంలో వైసీపీ కార్యకర్తగా కొనసాగుతూ మార్కెట్‌లో పెత్తనం చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరించేవాడని పలువురు వ్యాపారులు, కార్పొరేషన్ అధికారులు వెల్లడిస్తున్నారు. అధికారులు షాపును రోడ్డుపై కాకుండా లోపలకి పెట్టుకోవాలని ఆదేశించిన ప్రతిసారీ ఇలా బెదిరింపులకు పాల్పడటం అనవాయితీగా మారిందని విమర్శిస్తున్నారు. ఇతని వ్యవహార శైలి అగ్నిమాపకశాఖ అధికారులకు, ఇటు పోలీసులకు, కార్పొరేషన్ అధికారులకు తలనొప్పిగా మారిందని పలువురు అంటున్నారు.

నేటి నుంచి ఎంపిక చేసిన వారికి శిక్షణ

ఒంగోలు విద్య, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్కూల్ లీడర్షిప్ శిక్షణ కార్యక్రమానికి కేటాయించిన ప్రిన్సిపాల్స్, ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులకు సోమవారం నుంచి ఆరు రోజుల పాటు ఒంగోలులోని శ్రీ రామ చంద్రమిషన్‌లో శిక్షణ కార్యక్రమం ప్రారంభమవుతుందని డీఈవో కిరణ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1,2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు, కేఆర్‌పీలు, డీఆర్‌పీలకు చీరాలలోని ఎఫ్‌ఎల్‌ఎన్ శిక్షణా కేంద్రంలో విధులు కేటాయించిన వారు కూడా హాజరు కావాలన్నారు. విధులు కేటాయించిన వారి వివరాలను ఇప్పటికే మెయిల్, వాట్సాప్ ద్వారా పంపామని, సంబంధిత ఉప విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలు విధులకు కేటాయించిన వారిని వెంటనే రిలీవ్ చేయాలని డీఈవో ఆదేశించారు.

ఎస్ఈఎస్ఏ జిల్లా నూతన కార్యవర్గం



కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఒంగోలు విద్య, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ స్కూలు ఎడ్యుకేషన్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఆదివారం ఒంగోలులోని సమగ్ర శిక్ష కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నికల అధికారిగా ఎస్.సురేష్, పరిశీలకులుగా నెల్లూరు జిల్లా ప్రతినిధి రాజేంద్ర వ్యవహరించారు. అధ్యక్షులుగా వి.శివలీల, ప్రధానకార్యదర్శిగా జి.సాయిచైతన్య, కోశాధికారిగా పి.పేరయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా పి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా ఇ.ఆదిలక్ష్మి, పి.నాగరాజు, జి.కృష్ణమోహన్, జి.పాండురంగారావు, జి.సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎంవీ.రమణయ్య, సంయుక్త కార్యదర్శులుగా ఐ.వెంకటేశ్వర్లు, బి.విజేత, ఎం.కళ్యాణి, పి.వెంకటాద్రి, ఎస్.బాలకృష్ణ, మహిళా కార్యదర్శిగా బి.గౌరిలను ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గం మూడేళ్ళ పాటు కొనసాగనుంది. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యాశాఖ రిటైర్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ రోశయ్య, రిటైర్డ్ సూపరింటెండెంట్ జేవీ.ప్రసాద్, స్కూలు ఎడ్యుకేషన్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.పద్మకుమారి, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు అడకా స్వాములు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రతగా ఉండేలా చూడాలని విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పెనల మస్తాన్‌రావు కోరారు. ఆదివారం ఒంగోలులోని డాక్టర్ పి.ఆనంద్ మిని స్టేడియంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మినీ స్టేడియం చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం మస్తాన్‌రావు మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రజలందరూ పరిశుభ్రత పాటిస్తున్నారని, అదేస్ఫూర్తితో మన రాష్ట్రంలో కూడా పాటించాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు ఎస్ఈ అప్పలరాజు, పున్నయ్య, మేనేజర్ రాజరాజేశ్వరి, ప్రతిని ధులు రాధయ్య, శ్రీను, వెంకటేశ్వర రెడ్డి, కోటయ్య, రాధాకృష్ణమూర్తి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు శిక్షణ

ఒంగోలు(రూరల్), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి సమగ్ర సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండో బ్యాచ్‌కు శిక్షణ ఉంటుందని ఈవోఆర్డీ బాలచెన్నయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సిబ్బంది హాజరుకావాలని కోరారు.

ఇళ్లలో చోరీ చేసే నిందితుడి అరెస్ట్

- రూ.6లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- సీఐ హజరత్తయ్య వెల్లడి



వివరాలను వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య, పక్కన ఎస్సై మహేంద్ర

సింగరాయకొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : తాళం వేసిన ఇళ్లను టార్గెట్ చేస్తాడు.. పగటి పూట రెక్కీ నిర్వహిస్తాడు.. ఇంటిలో ఎవరూ లేని సమయంలో తాళాలను పగలకొట్టి లోపలికి ప్రవేశిస్తాడు.. అనంతరం బీరువాను బద్దలకొట్టి అందులోని సొత్తును దోచుకెళ్తారు. ఇలా పలు చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతున్న దొంగను ఆదివారం సింగరాయకొండ ఎస్సై బి.మహేంద్ర తన సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ చావా హజరత్తయ్య కేసు వివరాలను వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా కందుకూరు మండలం మాచవరం గ్రామానికి చెందిన కట్టా మధుబాబు చెడు వ్యసనాలకు బానిసై చోరీలను వృత్తిగా ఎంచుకున్నాడు. ఈ నెల 2న సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని సుందర్‌నగర్‌కు చెందిన కుంచాల సునీత ఇంటికి తాళం వేసి పెరల్స్ డిస్టలరీకి పనికి వెళ్లింది. సాయంత్రం 4 గంటలకు ఆమె కుమారుడు వచ్చి చూడగా ఇంటి తాళం, బీరువా పగలకొట్టి ఉన్నాయి. వెంటనే తల్లికి ఫోన్ ద్వారా చెప్పాడు. హుటాహుటినా ఆమె వచ్చి పరిశీలించగా 5 గ్రాముల బంగారం పోయినట్లు గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నిందితుడిని ఆదివారం ఉదయం 7.30 గంటలకు జాతీయ రహదారిపై కందుకూరు రోడ్డు అండర్ పాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద రూ. 6లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మహేంద్ర, ఏఎస్సై మహబూబ్‌బాషా, శేషారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ తిరుపతిస్వామి, కానిస్టేబుల్ సుమన్‌ను సీఐ అభినందించారు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్



శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

ఒంగోలు నగరం, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం తగిన చర్యలు చేపట్టాలని ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో గిరిజన సంఘాల నాయకులు, గిరిజనులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నివాస స్థలాలు, సంక్షేమ పథకాలను పొందటానికి ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఒంగోలులోని మున్సిపల్ వాణిజ్య సముదాయంలో గిరిజనులకు వాటా మేరకు దుకాణాలను కేటాయింపు జరిపేలా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్టీ సంఘాల నాయకులు శంకర్‌నాయక్‌కు వినతిపత్రాలను అందజేశారు. కొత్తపట్నంరోడ్డులో చింతల సమీపంలో 55 నక్కల తెగకు చెందిన కుటుంబాలకు కేటాయింన ఇళ్ల స్థలాలు నివాసయోగ్యంగా లేవని కమిషన్ సభ్యునికి తెలిపారు. ఈ ప్రాంతంలో నక్కల కుటుంబాల వారికి కేటాయించిన ఇళ్ళ స్థలాలకు ప్రత్యామ్నాయంగా 15రోజుల్లోగా తగిన ఏర్పాట్లు చేయాలని కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్, కలెక్టర్ అన్సారియాను కోరారు. కొత్తపట్నం మండలంలో చేపల వేట జీవనాధరంగా ఉన్న గిరిజనులకు మత్స్యకారులకు ఇచ్చినట్లుగా గుర్తింపు కార్డులు అందేలా చూడాలని అధికారులను కోరారు. ఒంగోలు నగరం గిరిజన కాలనీల్లో కనీస మౌళిక సదుపాయాలు కల్పించాలని, మున్సిపల్ వాణిజ్య సముదాయాల్లో గి రిజనుల హక్కు మేరకు దుకాణాలను కేటాయించాలని కమిషనర్ వెంకటేశ్వరరావును కోరారు. ప్రభుత్వం నుంచి విడుదల చేస్తున్న నిధులను దామాషా ప్రకారం ఎస్టీల సంక్షేమానికే ఖర్చు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి వరలక్ష్మి, నాయకులు పేరం సత్యం, సైదా నాయక్, గంటా సుబ్బారావు, డాక్టర్ బాలాజీనాయక్ పాల్గొన్నారు.

బీఎన్‌కు నీటి సంఘాల అధ్యక్షుల కృతజ్ఞతలు



ఎమ్మెల్యే విజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న నీటి సంఘాల అధ్యక్షులు, నాయకులు

సంతనూతలపాడు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల నీటి సంఘాల అధ్యక్షులు ఆదివారం రాత్రి ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకేలు అందజేసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ నీటిసంఘాలు, చెరువుల నూతన అధ్యక్షులుగా ఎన్నికైన వారంత బాధ్యతగా రైతుల శ్రేయస్సు కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సంతనూతలపాడు టీడీపీ మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నీటి సంఘాల అధ్యక్షులు చెరుకూరి శ్రీను, మన్నం రంగనాయకమ్మ, అబ్బూరి శ్రీను, చీమకుర్తి మండలం నుంచి గోగినేని శ్రీనివాసరావు, పాలడుగు వెంకటనారాయణ, పూనాటి యలమంద, మన్నం శేషయ్య, వేల్పుల వెంకటేశ్వర్లు, చలువాది శ్రీను, అన్నమనేని రామవయ్య, వనిపెంట చినకోటయ్య, దొడ్డా వెంకట్రావు, అలుగుండ్ల శ్రీనివాసరెడ్డి, నల్లూరి మధుబాబు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా 'చెట్లతో చెలిమి' పుస్తకావిష్కరణ

- రచయిత్రి డాక్టర్ రాణీప్రసాద్‌కు సత్కారం



పుస్తకావిష్కరణలో పాల్గొన్న సాహితీవేత్తలు

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన ప్రముఖ రచయిత్రి డాక్టర్ కందేపి రాణీప్రసాద్ రచించిన చెట్లతో చెలిమి పుస్తకావిష్కరణ ఘనంగా జరిగింది. ఆదివారం ఒంగోలులోని ఎన్‌సీఏభవన్‌లో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పుస్తకావిష్కరణ సభకు నరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించారు. నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి పాకల ఝాన్సీ రాణి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా ఝాన్సీరాణి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తేళ్ల అరుణ మాట్లాడుతూ డాక్టర్ రాణీప్రసాద్ తండ్రి సుందరాచారి సైతం మంచి సాహితీప్రియుడన్నారు. ప్రకృతిపై తనకున్న ప్రేమతో పలు రకాల చెట్ల గురించి తన పుస్తకాల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారని చెప్పారు. ఝాన్సీరాణి ప్రసంగిస్తూ చెట్టు గురించి విజ్ఞానదాయకమైన వ్యాసాలను పుస్తకంలో పొందుపరిచారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాణీప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రరవే జాతీయ కమిటీ అధ్యక్షురాలు పి.రాజ్యలక్ష్మి, కళామిత్ర మండలి జాతీయ అధ్యక్షుడు నూనె అంకమ్మరావు, శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సేవాసమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, మాజీ ఎంపీపీ నాశం నరసమ్మ, బీరం అరుణ, తన్నీరు బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కవి సమ్మేళనంలో పిన్ని వెంకటేశ్వర్లు, గుండ్లాపల్లి రాజేంద్రప్రసాద్, బీరం అరుణ, షరీఫ్, ఎం.సూర్యకుమారి, మిడసల మల్లికార్జునరావు, శ్రీరామచంద్రుని లక్ష్మి, డీవీఎస్.రామాచార్యులు పాల్గొన్నారు. ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన రచయిత్రి శాంతలక్ష్మికి ఘనంగా నివాళర్పించారు.

ఉత్సాహంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పాస్టర్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కరుణాకాలనీలోని గెత్సమనే ప్రార్థన మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ గిద్యోను శంకర్ వాక్యోపదేశం చేశారు. అనంతరం కుష్టు వ్యాధిగ్రస్తులకు, దివ్యాంగులకు, వితంతువులకు, పేదలకు దుస్తులను అందజేశారు. అనంతరం ప్రేమవిందును అందించారు. ఈ సందర్భంగా సండేస్కూలు చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో పాస్టర్‌లు రాజేష్, సురేష్, టి.డేవిడ్‌రాజు, ఏకాంబరం, బి.హరిబాబు, ఎం.బ్రహ్మయ్య, కె.పీటర్, డాక్టర్ శ్యామ్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ కార్యక్రమాలు : ఎంపీడీవో

మద్దిపాడు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిర అభివృద్ధిని సాధించటం కోసం మద్దిపాడు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 16వ తేదీ నుంచి రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జ్యోతి ఆదివారం తెలిపారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వ సిబ్బందిని రెండు బ్యాచ్‌లుగా చేసి ఒక్కొక్క బ్యాచ్‌కు రెండు రోజులు శిక్షణ ఇస్తామన్నారు. 16,17 తేదీల్లో గ్రామ పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, సంక్షేమ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లుతో పాటు మహిళ పోలీసులు, ఎనర్జీ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఉంటుందన్నారు. 18, 19 తేదీల్లో అన్ని గ్రామ పంచాయతీల్లో డిజిటల్ అసిస్టెంట్, వీఆర్వో, గ్రామ సర్వేయర్లు, అగ్రికల్చర్, వెటర్నరీ అసిస్టెంట్లకు, ఏఎన్ఎంలకు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

- నివాళులర్పించిన నాయకులు, సంఘాలు



ఒంగోలులో అమరజీవికి ఆర్యవైశ్యుల నివాళి

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక సీవీఎన్ రీడింగ్ రూము దగ్గర ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘ అధ్యక్షుడు పబ్బిశెట్టి భాస్కర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాములు చూపిన త్యాగనిరతి ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి వలేటి పవన్, బాపూజీ కాంప్లెక్స్ అధ్యక్షుడు తాన చెంచయ్యగుప్తా, కొప్పురావూరి సురేష్, కొల్లిపల్లి సురేష్, చీదెళ్ల ఉమామహేశ్వరరావు, పేర్ల సత్యం, టి.ఆంజనేయులు పాల్గొన్నారు.

- స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సైతం పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్‌ల వర్ధంతిని నిర్వహించారు. కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉప గ్రంథపాలకురాలు కోటేశ్వరి, లైబ్రేరియన్ సంపూర్ణ, డి.సందీప్, పి.ఇమ్మానుయేలు, ఎం.శివకుమారి పాల్గొన్నారు.

ఎస్పీ నివాళులు

ఒంగోలు(క్రైం): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతులను పురస్కరించుకుని వారి చిత్రపటాలకు ఆదివారం ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ దామోదర్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, ఆర్ఐ సీతారామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో..

ఒంగోలు కలెక్టరేట్: స్థానిక వైసీపీ జిల్లా కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు అమరజీవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి అదెన్న, నాయకులు కటారి శంకర్, డీఎస్.క్రాంతికుమార్, కొమ్మూరి కనకారావు, రొండా అంజిరెడ్డి, సుబ్బారావు, ఆంజనేయులు, విజయలక్ష్మి, రమణారెడ్డి, కరుణాకర్, బొట్లా సుబ్బారావు, కఠారి ప్రసాద్, ఇమ్రాన్‌ఖాన్, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంతనూతలపాడులో..

సంతనూతలపాడు: సంతనూతలపాడులో వాసవీక్లబ్, ఆర్యవైశ్యమందిరం కమిటీ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యమందిరం వద్ద, బస్టాండ్ వద్ద నున్న పొట్టిశ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు టీడీపీ నాయకుల సమక్షంలో పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మద్దినేని హరిబాబు, నాయకులు మన్నం రంగనాయకమ్మ, చెరుకూరి శ్రీను, పీఎన్.స్వామిచౌదరి, యలమందారెడ్డి, చిరంజీవి, సుబ్బారావు, వాసవీక్లబ్ జిల్లా ప్రతినిధి జీఎల్.ప్రసాదరావు, మాజీ అధ్యక్షులు బద్రీనారాయణ, ఆర్యవైశ్య మందిరం అధ్యక్షుడు వేమా మల్లేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి తీవ్ర గాయాలు

మద్దిపాడు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం గుండ్లాపల్లి పరిశ్రమల కేంద్రం దగ్గర ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలికి చెందిన ఆర్.కార్తీక్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన గుంటూరులోని కాటూరి వైద్యకళాశాలలో ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. ఈక్రమంలో కార్తీక్ ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళ్తుండగా పరిశ్రమల కేంద్రం దగ్గర ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలు కాగా బాధితుడిని ఒంగోలులోని కిమ్స్ వైద్యశాలకు చికిత్స కోసం తరలించారు.

వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షుడిగా సురేష్‌బాబు



సురేష్‌బాబును అభినందిస్తున్న శిద్దా సూర్యప్రకాష్‌రావు

నాగులుప్పలపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షుడిగా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కొంజేటి సురేష్‌బాబు ఎన్నికయ్యారు. తమిళనాడు రాష్ట్రం మధురైలో తమకం కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన ది లెజెండ్స్ ఐకాన్ కార్యక్రమంలో భాగంగా వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ 2025 ఏడాదికి గానూ క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షుడిగా ప్రస్తుతం క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న కొంజేటి సురేష్‌బాబును, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన పులకణం రాజేష్‌బాబును నియమించి ప్రమాణస్వీకారం చేయించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని సురేష్‌బాబు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారిని క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటీవ్ ఉపాధ్యక్షులు శిద్దా సూర్యప్రకాష్‌రావు, క్లబ్ సభ్యులు అమరా వేణు, ప్రసాద్ తదితరులు అభినందించారు.

సగర సంఘ ప్రధాన కార్యదర్శిగా మురళీకృష్ణ



నియామకపత్రాన్ని అందుకుంటున్న మురళీకృష్ణ

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా సగర(ఉప్పర) కమిటీ ప్రధాన కార్యదర్శిగా జలశ్రీ మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఒంగోలులోని కేశవస్వామిపేటలోని భగీరధ మహర్షి మందిరంలో జరిగిన కమిటీ సమావేశంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు జూటూరి శ్రీనివాసులు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ గతంలో ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించిన తనకు ప్రధాన కార్యదర్శిగా అవకాశం కల్పించటంపై కృతజ్ఞతలు తెలిపారు. సగర పనివారల సంక్షేమం కోసం కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు రెడ్డి పరమేశ్వరరావు, మిడాల వెంకటనారాయణ, కొండా వెంకటేశ్వర్లు, కె.రమణయ్య, జె.హర్షవర్ధన్, జె.ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖజానా, లెక్కలశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రాజ్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఖజానా, లెక్కలశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా జిల్లా ట్రెజరీ ఏటీఏగా పనిచేస్తున్న కాజ రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తిరుపతిలో ఆదివారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా కడప జిల్లాకు చెందిన గోవిందు రవికుమార్, ప్రకాశం జిల్లాకు చెందిన రాజ్‌కుమార్ ప్రధానకార్యదర్శిగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా జిల్లాకు చెందిన ఎస్కే.అబ్దుల్‌ఖాదర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులను అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి, శాఖ పురోభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. తనను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్న ఉద్యోగులకు కృతజ్ఞతలు చెప్పారు.

రేపు సింగరాయకొండలో జాబ్ మేళా

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ ఆధ్వర్యంలో సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 17వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి రవితేజయాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆయా కంపెనీల్లో వివిధ రకాల ఖాళీలను భర్తీ చేసేందుకు ఏదైనా విభాగంలో పదో తరగతి, ఐటీఐ, డిప్లొమో, ఇంటర్, ఏదైనా డిగ్రీ చదువులు పూర్తి చేసుకున్న వారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చని తెలిపారు. ఈ జాబ్ మేళా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులకు జీతం నెలకు రూ.12వేల నుంచి రూ.18వేల వరకు ఉంటుందన్నారు. జిల్లాలోని 18నుంచి 30 ఏళ్లలోపు నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 8897964505 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు అయ్యప్పస్వామి అఖండ పడిపూజ

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం లాయర్‌పేటలోని మాజీ మంత్రి శిద్దా నివాసం దగ్గర సోమవారం రాత్రి అయ్యప్పస్వామి అఖండ పడిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆదివారం శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు తెలిపారు. కనుక అయ్యప్ప, శివ, అంజనేయ, భవానీ స్వాములు పాల్గొనాలని వారు కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టంగుటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టంగుటూరులోని ఓ సినిమా థియేటర్‌లో సినిమాకు వెళ్లిన ద్వారకా హోటల్ వెంకట్రావు(63) నెత్తిన సౌండ్ బాక్స్ పడడంతో గాయపడిన విషయం తెలిసిందే. దీంతో అతన్ని కుటుంబ సభ్యులు వెంటనే ఒంగోలులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడి వైద్యుల సూచనమేరకు మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను శనివారం రాత్రి కన్నుమూశాడు. సౌండ్ బాక్స్ నెత్తన పడ్డ రోజునే పోలీసులు జరిగిన సంఘటనపై కేసు నమోదు చేశారు.

ఆస్టర్ రమేష్‌లో అత్యాధునిక వైద్యసేవలు

త్వరలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు • హాస్పిటల్ ఎండీ డాక్టర్ పోతినేని

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆస్టర్ రమేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యరంగంలో అత్యాధునిక టెక్నాలజీతో వైద్యసేవలను అందిస్తున్నట్లు హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు వెల్లడించారు. బుధవారం ఒంగోలులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 1000 మందికి ఉచిత వైద్య సహాయాన్ని అందించారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడుతూ ఒంగోలులో ఆసుపత్రిని 300 పడకల స్థాయికి పెంచుతున్నట్లు తెలిపారు. త్వరలోనే ఎకనామి, ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి తీసుకువస్తామని, ఆధునిక గుండె వైద్యసేవలు అందిస్తామని చెప్పారు. రమేష్ క్లౌడ్ డాక్స్ ద్వారా అత్యవసర సేవలు అందజేస్తామని వెల్లడించారు. సమావేశంలో యూనిట్ హెడ్ నల్లూరి నితిన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ, స్ట్రాటజీ హెడ్ డాక్టర్ కళ్యాణ్, గుండె వైద్యనిపుణులు జయరామ్ పాయ్, గ్రూప్ బిజినెస్ డాక్టర్ కార్తీక్‌చౌదరి పాల్గొన్నారు.

పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

ఒంగోలు విద్య, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అప్స డెమోక్రటిక్ ఆధ్వర్యంలో ఒంగోలులోని శ్రీతిభ కాలేజీలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలు రాసే విధానంపై నిపుణులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇచ్చారు. అప్స జిల్లా అధ్యక్షుడు హరిబాబు అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో భౌతిక శాస్త్రంపై కేఎస్.రవికాంత్, ఇంగ్లీషు సబ్జెక్టుకు స్వర్ణలత, తెలుగు సబ్జెక్టుకు రామాంజనేయులు, గణితంకు హరిబాబు, హిందీ సబ్జెక్టుకు సతీష్‌కుమార్ మెలకువలు వివరించారు. కార్యక్రమంలో నేతాజీ స్కూలు సాయి, ఆక్స్‌ఫర్డ్ స్కూలు సత్యనారాయణ, వలపర్ల కరీముల్లా, ఆక్రిడ్జ్ బాలకృష్ణ, శారద స్కూలు తిరుపతిరెడ్డి, చైతన్య స్కూలు ప్రసన్న, రాజారావు, ప్రభాకర్‌రావు, మద్దులూరు శేఖర్‌బాబు, స్వామి శివానంద స్కూలు సాయి, విజ్ఞానభారతి జమీర్, రఘుప్రదీప్, నలంద స్కూలు ప్రసాద్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆ ఊళ్లో రూ.కోట్ల అస్తులున్న స్థితిమంతులున్నారు. ఉన్నత ఉద్యోగాలు చేస్తూ రూ.లక్షల్లో జీతాలు పొందే సిరిమంతులున్నారు. భారీస్థాయిలో భూములున్న ధనిక రైతులున్నారు. అయినా ఎవరూ తమ ఇంటిపై మరో అంతస్తు వేయరు. ఊరు మొత్తం ఇదే సంప్రదాయాన్ని పాటిస్తారు. తమ పూర్వీకుల నుంచి ఇదే ఆచారాన్ని కొనసాగిస్తున్నారు. దీనికి కారణం తమ ఊరి కొండపై వరాహ లక్ష్మీనరసింహస్వామి కంటే ఎక్కువ ఎత్తులో ఎవరూ ఉండకూడదని కట్టుబాటు. స్వామివారి కంటే తక్కువ ఎత్తులో ఉంటే చల్లగా ఉంటామని గ్రామస్థుల విశ్వాసం. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇంటిపై పైఅంతస్తులేని గ్రామంగా విశిష్టతను చాటుకున్న పాతసింగరాయకొండ, వరాహ లక్ష్మీనరసిహస్వామి ఆలయం చరిత్రపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..


పైఅంతస్తులేని పాత సింగరాయకొండ వ్యూ

ఆస్తులున్నా అంతస్తులుండవు!

- రూ. కోట్లు ఉన్నా ఇంటిపై అంతస్తులు నిర్మించరు
- ఏళ్ల తరబడి గ్రామంలో ఆచారం
- కట్టుబాటును పాటిస్తున్న గ్రామస్థులు
- ఊరి కొండపై లక్ష్మీనరసింహస్వామి కంటే ఎక్కువ ఎత్తులో ఉండకూడదని ఆచారం
- రాష్ట్రంలోనే పై అంతస్తులేని గ్రామంగా విశిష్టతను చాటుకుంటున్న పాతసింగరాయకొండ

సింగరాయకొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన వరాహ లక్ష్మీనరసింహస్వామి కొలువుదీరిన పాతసింగరాయకొండ ప్రధాన గ్రామంలో దాదాపు 300 గృహాలున్నాయి. సుమారు 60 ఏళ్ల క్రితం రెండు మూడు ఇళ్లు తప్ప, అన్నీ గుడిసెలే. కాలక్రమేపీ భవనాలు నిర్మించుకున్నారు


వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం

కానీ పైఅంతస్తు నిర్మించుకోవాలనే అభిలాష, ఆర్థిక స్థామత ఉన్నా ఎవరూ సాహసించరు. స్వామివారి కంటే తక్కువ ఎత్తులో ఉంటే సుభిక్షంగా ఉంటామని తమ పూర్వీకులు చెప్పిన మాటలను ఈ తరం కూడా తూచతప్పకుండా పాటిస్తోంది. కుటుంబంలో సభ్యుల సంఖ్య పెరిగి ఇంటిపై మరో అంతస్తు అవసరం ఉన్నా మరో ఇంటిని నిర్మించుకుంటారే తప్ప, పైఅంతస్తు మాత్రం నిర్మించరు. ఆర్థికంగా స్థిరపడినవారు కూడా తమ ముందు తరం వారు పాటించిన విశ్వాసాన్ని ఇప్పటి యువతరం పాటించడం ఇక్కడి ప్రత్యేకత.

ఆలయ చరిత్ర

పూర్వం దేవర్షి అయిన నారదులవారు ఇక్కడ స్వామి కోసం తపస్సు చేయగా యోగానంద లక్ష్మీనరసింహస్వామి రూపంలో స్వామివారు వెలిశారని భక్తుల నమ్మకం. త్రేతాయుగంలో సీతాలక్ష్మణ సమేతంగా రామచంద్రమూర్తి అరణ్యవాసం చేస్తూ ఈ ప్రాంతానికి వచ్చి కొండపై ఉన్న యోగానంద వరాహ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నట్టు, స్వామివారు యోగమూర్తి కాబట్టి శాంతమూర్తిని ప్రతిష్ఠించాలని వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని రామచంద్రులవారు ప్రతిష్ఠించినట్టు స్థలపురాణం చెబుతున్నట్టు భక్తులు విశ్వసిస్తున్నారు. అప్పటి నుంచి ఈ క్షేత్రం వరాహ లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంగా విరాజిల్లుతోంది. వరాహ లక్ష్మీనరసింహస్వామికి ఇరువైపులా రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లు కొలువుదీరి ఉంటారు. ఇంద్రుడు ఆకాశమార్గంలో ప్రయాణిస్తూ ఆయన చేతిలోని వజ్రాయుధాన్ని జారవిడిచారని, ఆయుధం స్వామివారి ఆలయానికి తూర్పుభాగాన పడి ఘాతం ఏర్పడిందని, అలా ఏర్పడిన కోనేరు ముక్తిభవనాసిగా ప్రసిద్ధి చెందిందని పురాణాలను నమ్మేవారు చెబుతున్నారు. ఆలయానికి పశ్చిమ భాగాన ఉన్న భవనాసి అనే కోనేరు.. కన్వమహర్షి యజ్ఞం చేయగా ఆ యజ్ఞకుండమే భవనాసిగా ఏర్పడిందని ఇక్కడి స్థల పురాణాలు తెలుపుతున్నాయి.

ప్రచారంలో ఉన్న పురాణ గాథ

పూర్వం స్వామివారు కొలువుదీరిన కొండ ప్రాంతమంతా అరణ్యంగా ఉండేదట. ఇక్కడి స్వామివారికి అర్చన చేయడానికి పక్క గ్రామం నుంచి వచ్చి నివేదనాది కార్యక్రమాలు నిర్వహించి తిరిగి వెళ్లే వారట. ఒకరోజు ఒక అర్చకుడు తన ఐదేళ్ల కుమారుడితోపాటు ఆలయానికి వచ్చి స్వామికి అర్చన చేస్తుండగా బాలుడు ఆడుకొని అలసిపోయి యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని గృహంలో నిద్రించాడట. అది గమనించని అర్చకుడు బాలుడు బయట ఉన్నాడని భావించి ఆలయ తలుపులను మూసివేశాడట. తదనంతరం బాలుడి కోసం చుట్టుపక్కల వెతుకులాడినా కనిపించడట. దీంతో అర్చకుడు ఇంటికి వెళ్లి మరునాడు దుఃఖిస్తూ స్వామివారికి అర్చన చేయడానికి గుడి తలుపులు తెరిచి చూడగా బాలుడు స్వామివారి పాదాలపై నిద్రిస్తూ ఉన్నాడట. దీనిని చూసి ఆశ్చర్యపోయిన అర్చకుడు తన కుమారుడిని తట్టిలేపి స్వామివారి పాదాలచెంతకు ఎలా చేరావని ప్రశ్నించాడట. ఒక్కసారిగా తండ్రిని చూసి ఆ బాలుడు దుఃఖిస్తూ రాత్రి చీకటిలో భయపడుతూ ఉండగా ఒక తాత వచ్చి పెరుగు అన్నం పెట్టి తన ఒడిలో పడుకోబెట్టుకొని నిద్రపుచ్చాడని చెప్పినట్టు ఒక గాథ ప్రచారంలో ఉంది. ఆ బాలుడికి తాత రూపంలో దర్శనమిచ్చినందున నాటి నుంచి యోగానంద లక్ష్మీనరసింహస్వామిని తాతయ్యస్వామిగా భక్తులు పిలుస్తున్నారు. బాలుడికి పెరుగు అన్నం పెట్టినందుకు స్వామికి రోజూ ఉదయం దధ్యోజనంతో (పెరుగు అన్నం) నివేదన చేస్తున్నారు.

స్వామివారి మీద ఉన్న భక్తితోనే పై అంతస్థు వేయం



మా పూర్వీకులు ఎవరూ గ్రామంలో ఇంటిపై పైఅంతస్థు వేయలేదు. పై అంతస్థు వేస్తే స్వామివారి కంటే ఎక్కువ ఎత్తులో ఉంటామనేది వారి ఆలోచన. స్వామికంటే తక్కువ ఎత్తులో ఉంటే శుభం జరుగుతుందని మాపెద్దల నమ్మకం. అదే సిద్ధాంతాన్ని, విశ్వాసాన్ని ఇప్పటి తరమైన మేం కూడా పాటిస్తున్నాం.

- కాకర్ల రమణ, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, పాతసింగరాయకొండ

జిల్లా జూనియర్ బాలికల
కబడ్డీ జట్టు ఎంపిక

సింగరాయకొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాకల జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం జిల్లా జూనియర్ బాలికల కబడ్డీ జట్టును ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు డీవీఎస్ ప్రసాద్ తెలిపారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ పిల్లి హజరత్తయ్య, హజీరాబేగం, కార్యవర్గ సభ్యులు కె.శ్రీలక్ష్మి ఎంపిక పోటీలను పర్యవేక్షించారు. ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకూ తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థినులను జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కర్‌రావు, సెక్రటరీ పూర్ణచంద్రరావు ప్రత్యేకంగా అభినందించారు


జిల్లా జూనియర్ బాలికల కబడ్డీ జట్టుకు ఎంపికైన విద్యార్థినులు

జట్టు వివరాలు : వి.అర్చన(పాకల), కె.భూమిక(పాకల), కె.నందిని(పాకల), కె.వి జయలక్ష్మి(పాకల), కె.త్రిగుణ(పాకల), కె.సిపోరా(పాకల), వి.కార్తీక(పాకల), పి.స్వాతి(పాకల), వి.ధనలక్ష్మి(పాకల), కె.నిరీష(కరేడు), కె.పుష్ప(వేటపాలం), కె.గాయత్రి(వేటపాలెం), డి.హసన్‌బీ(మార్కాపురం), డి.జోష్ణప్రియ (వై.డిపాడు), ఎ.సాయిలత (చీమకుర్తి)..

ఏటీఎంలో నగదు చోరీకి యత్నం

- అలారం మోగడంతో రంగంలోకి గస్తీ పోలీసులు, బ్యాంకు మేనేజర్
- పరారైన దుండగుడు
- నగదు భద్రం

కొండపి, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి) : కొండపిలోని పొదిలి రోడ్డులోగల ఎస్‌బీఐ బ్రాంచ్ ఆవరణలో ఉన్న ఏటీఎంలో నగదు చోరీకి ఓ దుండగుడు విఫలయత్నం చేశాడు. ఏటీఎంలో అలారాన్ని హెడ్ క్వార్టర్‌తో అలర్ట్ చేయడంతో గస్తీలో ఉన్న పోలీసులు రంగప్రవేశం చేశారు. దీంతో దుండగుడు సుత్తిని వదిలి పరారయ్యాడు. శనివారం అర్థరాత్రి దాటాక దాదాపు 1.10 నిమిషాల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఏటీఎం లోపల, వెలుపల నాలుగు సీసీ కెమెరాలు ఉండగా రెండింటికీ దుండగుడు టేప్ అంటించాడు. మిగతా రెండు ఎత్తులో ఉండటంతో వదిలేశాడు. ఆ రెండు కెమెరాల్లో దుండగుడు చేసిన పనులు రికార్డు అయ్యాయి. దుండగుడు ముఖానికి మంకీ క్యాప్ తగిలించుకున్నాడు. స్వెటర్ వేసుకుని, ప్యాంటు ధరించి ఉన్నాడు. సుత్తితో నగదు ఉంచే డోర్‌ను పగులగొట్టాడు. లోపలి డోర్‌ను సుత్తితో కొట్టినప్పటికీ పగలకపోవడంతో స్క్రూడ్రైవర్ లాంటి వస్తువుతో నట్లు తీసే యత్నం చేశాడు. సుత్తితో కొట్టగానే ఏటీఎంలకు సంబంధించిన కమాండ్, కంట్రోల్ రూంలో అలారం మోగడంతో కేంద్ర కార్యాలయం నుంచి ఫలానా ఏటీఎంలో చోరీ జరుగుతుందన్న సమాచారాన్ని 108కి అందించారు. మంగళగిరి పోలీస్ హెడ్ కార్టర్స్ నుంచి సమాచారం కొండపి పోలీస్ స్టేషన్‌కు రావడంతో ఆ దగ్గరలోనే ఏటీఎం ఉండటంతో గస్తీలో ఉన్న సిబ్బంది ఏటీఎం వద్దకు చేరుకున్నారు. ఎస్‌బీఐ బ్రాంచ్‌కు దగ్గరలోనే నివాసం ఉంటున్న బ్యాంక్ మేనేజర్‌కు కూడా ఏటీఎం కేంద్ర కార్యాలయానికి సమాచారం అప్పటికే అందించడంతో ఏటీఎం వద్దకు చేరుకున్నారు. అప్పటికే అనుమానించిన నిందితుడు మోటార్ సైకిల్‌పై పరారయ్యాడు. ఎస్‌ఐ ప్రేమ్ కుమార్ ఒంగోలు నుంచి క్లూస్ టీంని రప్పించి ఆధారాలు సేకరించారు. చోరీయత్నం ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు.


ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు

తారలు వెలసిన వేళ..

ఆకట్టుకుంటున్న క్రిస్మస్ స్టార్స్
జిల్లా అంతటా మొదలైన పండుగ సందడి


అరవకాలనీలో ఏర్పాటు చేసిన స్టార్


బృందావన కాలనీలో ఏర్పాటు చేసిన రంగు రంగుల నక్షత్రం


సీఆర్పీక్వార్టర్స్ రోడ్డులో స్టార్‌ల సమూహం

క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే క్రిస్మస్‌పండుగ సందడి మొదలైంది. ఈ సందర్భంగా ప్రధాన చర్చిలు, క్రైస్తవపాఠశాలలూ, ఊరూ, వాడా, క్రిస్మస్ కాంతులు విరాజిల్లుతున్నాయి. ఆయా కాలనీల్లో స్థానిక యువకులు వారం పది రోజులుగా స్టార్స్ తయారీ, డెకరేషన్‌లలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉంచితే ఆయా స్టార్స్‌లను మిరుమిట్లు గొలిపే అందమైన విద్యుత్ దీపాలతో ముస్తాబు చేయడంతో అందరినీ ఆకట్టుకుంటున్నాయి. దీంతో జిల్లా అంతటా క్రిస్మస్ సందడి మొదలైంది.

- ఒంగోలు, కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)


మామిడిపాలెంలో ఓ ప్రార్థనా మందిరంలో విద్యుత్ దీపాలతో అలంకరణ



నీలాయపాలెంలో ఆకట్టుకుంటున్న ఏసుపుట్టుక స్టార్


మహాసభకు హాజరైన నేతలు (ఇన్‌సెట్లో) జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన మాబు



సీపీఎం జిల్లా కార్యదర్శిగా
మాబు ఎన్నిక

- ముగిసిన 14వ మహాసభలు

సంతనూతలపాడు(చీమకుర్తి), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): చీమకుర్తిలో మూడురోజుల పాటు జరిగిన సీపీఎం14వ జిల్లా మహాసభలు ఆదివారంతో ముగిశాయి. మహాసభలలో జిల్లా కార్యదర్శిగా షేక్ మాబును, 26 మందితో జిల్లా కమిటీని, 8 మందితో కార్యదర్శి వర్గాన్ని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు భవిష్యత్తు కార్యక్రమాలపై దిశానిర్ధేశం చేశారు. సమస్యలపై రానున్న కాలంలో కేంద్రీకరించి పనిచేయాలని, తద్వారా పార్టీ బలోపేతానికి పునాదులు వేయాలని కోరారు. వెనుకబడిన జిల్లాకు రూ. 10వేల కోట్లు కేటాయించాలని, వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేసి రైతులకు నీరందేలా భవిష్యత్తు చర్యలు చేపట్టాలని ఆయన తెలిపారు. జిల్లాలో పార్టీని ఐక్యంగా నడిపించేందుకు నావంతు కృషిచేస్తానని, సీనియర్ల సలహాలు, సూచనలతో ముందుకుసాగుతానని నూతనంగా ఎంపికైన జిల్లా కార్యదర్శి ఎస్‌కె.మాబు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎంరాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు, కారుసాల సుబ్బరామమ్మ, రాష్ట్ర కమిటీసభ్యులు కే.ఉమామహేశ్వరరావు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

లిఫ్ట్ అడిగి.. బెదిరించి
బైక్‌లను చోరీ చేస్తున్న దొంగల అరెస్ట్

సింగరాయకొండ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఒంటరిగా మోటార్ బైక్‌పై వెళ్తున్న వారిని లిఫ్ట్ అడిగి ఆ తరువాత బెదిరించి బైక్‌లను తీసుకొని పరారవుతున్న నిందితులను సింగరాయకొండ ఎస్సై బి. మహేంద్ర ఆదివారం అరెస్ట్ చేశారు. సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ హజరత్తయ్య కేసు వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు జిల్లా ఉలవపాడు గ్రామానికి చెందిన రావూరి వెంకటేశ్వర్లు బైక్‌పై వెళుతుండగా ఈ నెల 11వ తేదీ సాయంత్రం 4 గంటలకు జాతీయ రహదారిపై గల జీవీఆర్ ఫ్యాక్టరీ వద్ద ప్రశాంత్‌కుమార్ లిఫ్ట్ అడిగాడు. కొద్దిదూరం వెళ్లాక బైక్‌ను ప్రశాంత్‌కుమార్ ఆపించగా అక్కడ మాటువేసి ఉన్న తన స్నేహితులు ఊళ్లపాలేనికి చెందిన రౌడీషీటర్ కొల్లా సాయి, పసుపులేటి శ్రీకాంత్‌లతో కలిసి వెంకటేశ్వర్లును బెదిరించి బైక్‌ను తీసుకొని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై మహేంద్ర కేసు నమోదు చేశారు.

సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నిందితులు కొల్లా సాయి, పసుపులేటి శ్రీకాంత్‌లను ఆదివారం ఉదయం కలికవాయి రోడ్డు అండర్‌పాస్ వద్ద ఎస్సై తన సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. కేసులో మరో నిందితుడిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు. చాకచక్యంగా కేసును ఛేదించిన ఎస్సై మహేంద్రను, పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించినట్లు సీఐ హజరత్తయ్య వెల్లడించారు.

క్రైం సమాచారం

జగన్నాథపురంలో గంజాయి సాగు కలకలం


గంజాయిగా భావిస్తున్న మొక్క

తర్లుపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురంలో గంజాయి సాగు కలకలం రేపింది. ఒక రైతు దొడ్డిలో గంజాయి సాగు చేసినట్లు తర్లుపాడు ఎస్‌ఐ బ్రహ్మనాయుడుకి సమాచారం అందింది. దీంతో పొదిలి సీఐతో కలిసి సాగు చేస్తున్న మొక్కలను పరిశీలించారు. ఇవి గంజాయి మొక్కలా లేదా అనేది నిర్ధారణ చేయాల్సి ఉందని ఎస్‌ఐ బ్రహ్మనాయుడు తెలిపారు. జగన్నాథపురంలో గంజాయి సాగు చేస్తున్నట్లు కలకలం రేగడంతో ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల కాలంలో ప్రభుత్వం గంజాయిపై ఉక్కుపాదం మోపుతుండటంతో గంజాయి సాగుకు స్వస్తి పలికారు. ప్రస్తుతం గంజాయి సాగుపై జగన్నాథపురంలో కలకలం రేగడంతో పశ్చిమ ప్రాంతంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

గిద్దలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాచర్ల మండలంలోని జేపీ గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 96 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం


సాయం అందజేస్తున్న శేషగిరి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముండ్లపాడు గ్రామంలోని వాల్మీకీ కాలనీకి చెందిన నల్లబోతుల రంగస్వామి గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఉపసర్పంచ్ కడియం శేషగిరి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థిక సాయాన్ని అందచేశారు.

అవీ..ఇవీ

భగవద్గీత పోటీలు

గిద్దలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్వభారతి పాఠశాల ఆవరణలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు రామిరెడ్డి అధ్యక్షతన భగవద్గీత పోటీలను నిర్వహించారు. విజేతలైన బాలబాలికలకు బహుమతులు అందజేశారు. హిందూ సాంప్రదాయాలను చిన్ననాటి నుండే అలవాటు చేయాలన్నారు. భగవద్గీత సారాంశం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్యానందస్వామి బీజేపీ నాయకులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు పాల్గొన్నారు.

రేపు పింఛనర్ల దినోత్సవం

గిద్దలూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విరా సుబ్బరత్నం కళ్యాణ మండపంలో ఈ నెల 17న మంగళవారం ఉదయం 10గంటలకు పింఛన్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జి.రవీంద్రనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారన్నారు. 15 మంది సీనియర్ పింఛనర్లను సన్మానిస్తామన్నారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగుల పుట్టలో పాలు పోశారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

గుంటూరుకు మాలసంఘాల నాయకులు


గుంటూరుకు వెళుతున్న మాలమహానాడు నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం మాల సంఘాల జేఏసీ నాయకులు ఆదివారం గుంటూరుకు బయలుదేరి వెళ్లారు. గుంటూరులో జరిగే మహాగర్జన సభకు మార్కాపురం పట్టణం, డివిజన్‌లోని వివిధ గ్రామాల నుంచి బయలుదేరారు. కార్యక్రమంలో మాలసంఘాల జేఏసీ నాయకులు నందం శేఖర్, జనుమాల నాగయ్య, నూతలపాటి రాజు తదితరులు పాల్గొన్నారు.





గుర్రపుడెక్కతో నిండిపోయిన సప్లైచానల్, వ్యర్థాలతో పూడిపోయిన ప్రధాన పంట కాలువ, నక్కలగండి కాలువ దుస్థితి, డంపింగ్ యార్డు కాదు, ఇరిగేషన్ కాలువే

మురుగు వీడదు.. నీరు పారదు

వ్యర్థాలతో నిండిన పంట కాలువలు

కంభం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లగా వైసీపీ పాలనలో పంటకాలువల మరమ్మతు చేయలేదు. దీంతో కాలువల్లో వ్యర్థాలు పేరుకు పోయాయి. కాలువలు పూడుకుపోవడంతో కంభం చెరువు నుంచి పంటపొలాలకు నీటిని అందించే సప్లై చానల్ మురుగు కాలువలుగా, చెత్తనిల్వ చేసే డంపింగ్ కేంద్రాలుగా మారాయి. కంభం చెరువు కింద ప్రధానంగా ఐదు సప్లైచానళ్లు ఉన్నాయి. పెద్దకంభం చానల్ పొడవు 7.2 కిలోమీటర్లు (చెరువు నుంచి కందులాపురం వరకు), చిన్నకంభం చానల్ పొడవు 10 కిలోమీటర్లు (చెరువు నుంచి దర్గ గ్రామం వరకు), చీతిరాలకతువ చానల్ పొడవు 10 కిలోమీటర్లు (చెరువు నుంచి ఎల్.కోట గ్రామం వరకు), నక్కలగండి ఛానల్ పొడవు 2.5 కిలోమీటర్లు, పాపాయిపల్లె చానల్ పొడవు 2.5 కిలోమీటర్లు ప్రధాన పంట కాలువలు ఉండగా వాటి నుంచి 30కి పైగా సప్లైచానళ్లు ఉన్నాయి. ఈ కాలువలన్నీ వ్యర్థాలన్నీ పేరుకుపోయి మురుగు కాలువలుగా మారాయి. పట్టణంలోని వీధుల నుంచి ప్రవహించే కాలువల్లోకి ప్రజలు మురికిని యథేచ్ఛగా వదులుతున్నారు. కాలువల్లో కాలుష్యం పెరిగి దుర్వాసన, దోమల బెడద ఎక్కువగా ఉంది. దీనికితోడు పందులు మరింత అపరిశుభ్రత చేస్తున్నాయి. ప్రస్తుతం కంభం చెరువులో నీరు ఉన్నా వ్యర్థాలతో నిండిపోయిన ఈ కాలువల ద్వారా పంట పొలాలకు నీరు వదలలేని పరిస్థితి. ఈ కాలువలను శుభ్రం చేయడం కోసం గత వైసీపీ ప్రభుత్వం ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడంతో రైతులకు శాపంగా మారింది. ఈ దుస్థితిలో ఉన్న కాలువలకు సాగునీటి సంఘాల్లో ఎన్నికైన టీడీపీ బలపరచిన వారు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన నాయకులకు ఈ పంట కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తను వేయకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

ఎమ్మెల్యేకు నీటి సంఘాల కార్యవర్గాల కృతజ్ఞతలు


నారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నూతన అధ్యక్షులు

మార్కాపురం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణ, మండల పరిధిలో నూతనంగా ఎన్నికైన సాగునీటి వినియోగదారుల సంఘాల నూతన కార్యవర్గాలు ఆదివారం మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపాయి. స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని టీడీపీ కార్యాలయంలో కార్యవర్గాల సభ్యులు ఆయన్ను కలిసి దుశ్శాలువాలు, పూలమాలలు వేసి అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ పదవులకు వన్నె తెచ్చేవిధంగా పని చేయాలని సూచించారు. ప్రధానంగా ఐదేళ్ల వైసీపీ పాలనలో చెరువులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయన్నారు. కనీసం ఒక్క రూపాయి నిధులు కూడా చెరువుల అభివృద్ధికి విడుదల చేయలేదన్నారు. ముందు నూతన అధ్యక్షులు, టీసీ సభ్యులు చెరువులను పరిశీలించి తగిన సూచనలు చేయాలన్నారు. తాను నియోజకవర్గ పరిధిలోని చెరువుల అభివృద్ధికి నిధులు సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పలు సంఘాల నూతన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు టీసీ సభ్యులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు క్రైస్తవుల సన్మానం

పొదిలి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల దీవెనలతోనే ఎమ్మెల్యేగా విజయం సాధించానని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. పొదిలి పట్టణంలోని తెలుగు బాప్టిస్టు పెద్ద చర్చిలో క్రైస్తవులు ఎమ్మెల్యేకు సన్మానసభ ఆదివారం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే సెమీ క్రిస్మస్‌కేకు కట్ చేయించి అందరికీ పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా క్రిస్టియన్ స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే త్వరలో ఎంపీతో చర్చించి ఎంపీ గ్రాంట్ నుంచి ఏర్పాటుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి కొంత నిధుల కొరత ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు తిరిగి రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు కష్టపడుతున్నారని కొనియాడారు. నియోజకవర్గాన్ని సైతం అభివృద్ధి పథంలో నడిపిస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో అనంతరం నీటి సంఘాల ఎన్నికల్లో గెలుపొందిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎమ్మెల్యే నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయుడు, పూర్ణాహుతిలో పాల్గొన్న భక్తులు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పలు ఆలయాల్లో ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. శివాలయంలో ఆదివారం సాయంత్రం ధనుర్మాస మహోత్సవాల వేడుకలు బ్రాహ్మణసేవా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మార్కాపురం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కప్పగంతుల మధుసూదనశాస్త్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పురాణ ప్రవచనాలు ప్రారంభించి ఆలపించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు అయ్యాలరాజు యోగేశ్వరరావు, త్రిపురాంతకం దేవాలయాల చైర్మన్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు, వాసవి కన్యాకాపరమేశ్వరి దేవాలయం అధ్యక్షులు సూరే వెంకట ప్రసాద్, ప్రవచన రూపకర్త దేవులపల్లి విశ్వనాథం బ్రాహ్మణ యువజన సంఘం కార్యనిర్వాహక అధ్యక్షులు చక్కిలం నాగరాజు, పురోహిత పెద్దలు రెంట చింతల రామచంద్రమూర్తి, కార్యనిర్వాకులు నానా నాగేశ్వరరావు, భక్తులు, పాల్గొన్నారు.



దత్తాత్రేయస్వామి ఆలయంలో

మార్కాపురం వన్‌టౌన్ : పట్టణంలోని నెహ్రూబాజార్‌లో షిరిడీ సాయిబాబా మందిర ప్రాంగణంలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో ఆదివారం భక్తిశ్రద్ధలతో దత్తజయంతి నిర్వహించారు. అర్చకులు దత్తత్రేయుని ప్రత్యేకంగా అలంకరించారు. ఏకాదశ రుద్రాభిషేకం, దత్తాత్రేయ హోమం, దత్తాత్రేయ జపం నిర్వహించి పూర్ణాహుతి కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం పెద్దఎత్తున అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకి ఉత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సాయి మందిర అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, గోపాలుని హరిహరరావు, కోశాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌లు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : క్రీడలతో ప్రతిఒక్కరికి శారీరక, మానసిక ఆరోగ్యం సమకూరుతుందని పట్టణ ఎస్‌ఐ ఎం.సైదాబాబు అన్నారు. స్థానిక కమలా సీబీఎస్‌ఈ హైస్కూల్‌లో ఆదివారం బాస్కెట్ బాల్, లాన్ టెన్నిస్‌బాల్ కోర్టులను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. టూటౌన్ ఎస్‌ఐ డా.రాజమోహన్ మాట్లాడుతూ, ఆటలలో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు కూడా పొందవచ్చన్నారు. వివిధ ఆటల ద్వారా మానసిక ఒత్తిడి తగ్గించుకోవచ్చన్నారు. తద్వారా అన్ని రంగాలలో రాణించవచ్చన్నారు. పాఠశాల కరస్పాండెంట్ పెనుగొండ పవన్ కుమార్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు, సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. స్వరూప్‌రంజన్, పీఈటీలు రజనీష్, శ్రీకాంత్, హరిలాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి



దోర్నాల, తర్లుపాడులో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి, విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఆర్యవైశ్యులు

ఎర్రగొండపాలెంరూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం పొట్టి శ్రీరాముల చేసిన ప్రాణత్యాగం మరువలేనిదని టీడీపీ వై.పాలెం ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ఆలాంటి మహానుబావుడిని ఆదర్శంగా తీసుకోవాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో వెంకటాద్రిపాలెం సర్పంచ్ శ్రీశైలపతి నాయుడు, పట్టణ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, నాయకులు చిట్యాల వెంగళ రెడ్డి, సత్యనారాయణ గౌడ్, కందుల నారాయణ రెడ్డి, వేగినాటి శ్రీనివాస్, ఒంగోలు ఓబులరెడ్డి, పుల్లారావు, శివ, నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయంలో

పొట్టి శ్రీరాముల 72వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదేశాలతో మండల కన్వీనర్ కొప్పర్తి ఒబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయనకు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు చేదూరి విజయబాస్కర్, సర్పంచ్ ఆరుణాబాయ్, మాజీ ఏఎంసి చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం అధ్వర్యంలో

పొట్టి శ్రీరాముల వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు సూరే వెంకటప్రసాద్, ఆర్యవైశ్య యువజనసంఘం రెడ్డి నరసింహారావు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం సెక్రటరీ పొట్టి రవి కుమార్, నాయకులు కృష్ణమూర్తి, రమణారావు, శ్రీనివాసులు, కాశీ, సూర్యం, పుల్లారావు, సురేష్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

పెద్దదోర్నాల : స్థానిక గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథపాలకుడు సుబ్బారెడ్డి అధ్యక్షతన దోర్నాల పంచాయతీ గ్రామ కార్యదర్శి శివ కోటేశ్వరరావు శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివకోటేశ్వరరావు మాటాడుతూ తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలను సైతం అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములని పేర్కొన్నారు.

గిద్దలూరు : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టిశ్రీరాములు జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణంలోని రేడియోబావి కూడలిలోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆవోపా అధ్యక్షులు దారా రాములు, అమ్మవారిశాల అధ్యక్షులు వాడకట్టు రంగ సత్యనారాయణ, వాసవిక్లబ్ ప్రతినిధులు బాదం వెంకటేశ్వర్లు, సూరె చెంచయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బీజేపీ ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఎ.ఉదయ్‌శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు టీవీ.రామాంజనేయులు, నాయకులు చంద్రమోహన్, బాదుల్లా, నరసింహులు, జె.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో పొట్టిశ్రీరాములు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. గ్రంథపాలకురాలు ప్రసన్నకుమారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తర్లుపాడు : తర్లుపాడులోని పొట్టి శ్రీరాములు పార్కులో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాలు మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు కశ్శెట్టి జగన్‌బాబు మాట్లాడుతూ, ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో వేణుగోపాలస్వామి ఆలయ ధర్మకర్త జవ్వాజి భాస్కర్, నెహ్రూ యూత్ అధ్యక్షులు బి.పుల్లయ్య, ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు దోగిపర్తి మల్లికార్జునరావు, జవ్వాజి జనార్ధన్, నేరెళ్ల కృష్ణ, సురేష్, వెంకటేశ్, బాలరంగం, శ్రీనివాసులు, నారాయణరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు : అమరజీవి పొట్టి శ్రీరాములు తెలుగు జాతి గౌరవాన్ని పెంపొందించారని ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు పోలెపల్లి ప్రవీణ్‌కుమార్ అన్నారు. స్థానిక శ్రీ వాసవీకన్యాకా పరమేశ్వరీ అమ్మవారిశాలలో ఆదివారం అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలుగువారి కోసం తెలుగు ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన నేత పొట్టి శ్రీరాములు అన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు సముద్రాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

21 నుంచి కబడ్డీ పోటీలు

- సౌత్ ఇండియా స్థాయిలో నిర్వహణ

గిద్దలూరు టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గిద్దలూరు మండలం ముండ్లపాడు గ్రామంలో క్రిస్మస్ సందర్భంగా ఈ నెల 21, 22 తేదీలలో సౌత్ ఇండియా స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ముండ్లపాడులోని సెయింట్ జాకబ్స్ ఉన్నత పాఠశాల ఆటస్థలంలో నిర్వహించే కబడ్డీ పోటీలలో పాల్గొనాలనుకునే టీంలు ఈనెల 20వ తేదీలోపు కమిటీ నిర్వాహకుల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కబడ్డీలో విజేతలకు మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండవ బహుమతిగా రూ.40వేలు, మూడవ బహుమతిగా రూ.30వేలు, నాల్గవ బహుమతిగా రూ.20వేలు, ఐదవ బహుమతిగా రూ.10వేలు, ఆరవ బహుమతిగా 5వేలు అందించడం జరుగుతుందన్నారు.

కానిస్టేబుల్ పోస్టుకు విద్యార్థి ఎంపిక


విద్యార్థి కిరణ్

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డిగ్రీ కళాశాలలో డిగ్రీ బీఏ ఫైనల్ ఇయర్ చదువుతున్న బోయలపల్లి గ్రామానికి చెందిన కే.కిరణ్ బీఎస్‌ఎఫ్ జీడీ కానిస్టేబుల్ పోస్టుకు ఎంపికైనట్లు డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ప్రదీప్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అన్ని విభాగాలల్లో రాణించేందుకు స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. కళాశాల అధ్యాపక సిబ్బంది విద్యార్థి కిరణ్‌ను అభినందించారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

టీడీపీ ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు


దుస్తులు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయం అని తెలుగుదేశం పార్టీ ఎర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జీ గూడూరి ఎరిక్షన్ బాబు అన్నారు. ఆదివారం మిల్లింపల్లి పంచాయితీలోని వేగినాటి కోటయ్య నగర్ కాలనీలో గ్లోరి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పాస్టర్లుకు, పేదలకు దుస్తుల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొని 100 మందికి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరక్టర్ ముటుకూరి దేవదానం, మాజీ సర్పంచ్ కంచర్ల సత్యనారాయణ గౌడ్, టీడీపీ నాయకులు వేగినాటి శ్రీనివాస్, యూనిట్ ఇన్‌చార్జ్ కొత్తమాసు అనంత వెంకట సుబ్రమణ్యం, చిట్యాల వెంగళరెడ్డి, బివి సుబ్బారెడ్డి, ఒంగోలు ఆదిరెడ్డి, నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షుడిగా సురేష్‌బాబు


సురేష్‌బాబును అభినందిస్తున్న శిద్దా సూర్యప్రకాష్‌రావు

నాగులుప్పలపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షుడిగా ఉప్పుగుండూరు గ్రామానికి చెందిన కొంజేటి సురేష్‌బాబు ఎన్నికయ్యారు. తమిళనాడు రాష్ట్రం మధురైలో తమకం కన్వెన్షన్‌లో ఆదివారం జరిగినది లెజెండ్స్ ఐకాన్ కార్యక్రమంలో భాగంగా వాసవీ క్లబ్ అంతర్జాతీయ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ 2025 ఏడాదికి గానూ క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షుడిగా ప్రస్తుతం క్లబ్ ఇంటర్నేషనల్ మల్టీపుల్ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్న కొంజేటి సురేష్‌బాబును, ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఉప్పుగుం డూరు గ్రామానికి చెందిన పులకణం రాజేష్‌బాబును నియమించి ప్రమాణస్వీకారం చేయించారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి క్లబ్ అభివృద్ధికి కృషి చేస్తానని సురేష్‌బాబు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారిని క్లబ్ ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటీవ్ ఉపాధ్యక్షులు శిద్దా సూర్యప్రకాష్‌రావు, క్లబ్ సభ్యులు అమరా వేణు, ప్రసాద్ తదితరులు అభినందించారు.

కష్టపడే వారికి టీడీపీలో గుర్తింపు

దర్శి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అహర్నిశలు పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇచ్చి గౌరవిస్తామని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు తెలుగు యువత నియోజకవర్గ అధికార ప్రతినిధి గుర్రం బాలకృష్ణ తెలిపారు. అమరావతిలో సీఎం చంద్రబాబును శనివారం రాత్రి కలిసి కార్యకర్తలు చేస్తున్న కృషిని వివరించారు. గత ఐదేళ్లుగా కార్యకర్తలు అనేకమంది పార్టీ కోసం అహర్నిశలు పనిచేశారని, వారికి తగిన గుర్తింపు ఇవ్వాలని కోరగా అందుకు సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చినట్లు బాలకృష్ణ వివరించారు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించినట్లు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

పీసీపల్లి, డిసెంబరు15 (ఆంధ్రజ్యోతి): పీసీపల్లి పోలీసుస్టేషనలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసును దర్శి డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆదివారం విచారించారు. ఈనెల 7న మండలంలోని వరిమడుగులో కొడవటిగంటి ఇమ్మానుయేల్, అదే గ్రామానికి చెందిన ప్రసాద్ ఘర్షణ పడ్డారు. ఈక్రమంలో ప్రసాద్, మరికొంతమంది తనని కులం పేరుతో దూషించి దాడి చేశారంటూ ఇమ్మానుయేల్ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఎస్ఐ జి.కోటయ్య బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదుచేశారు. ఈకేసు విచారణలో భాగంగా డీఎస్పీ లక్ష్మీనారాయణ ఆదివారం వరిమడుగు వెళ్లి బాధితులు, సాక్షులను విచారించినట్లు ఎస్ఐ తెలిపారు.

వెలిగొండ ప్రాజెక్టు పరిధిలోకి పీసీపల్లిని చేర్చాలి

పీసీపల్లి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): వెలిగొండ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోకి పీసీపల్లి మండలాన్ని చేర్చాలని సీపీఎం నాయకుడు మహేష్ అన్నారు. చీమకుర్తిలో జరిగిన సీపీఎం మహాసభల్లో ఆదివారం ఆయన మాట్లాడారు. పీసీపల్లి మండలంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులు అధికంగా ఉన్నారన్నారు. మండల ప్రజలు వినియోగించే తాగునీటిలో ఫ్లోరిన్‌శాతం అధికంగా ఉందన్నారు. మండల ప్రజలు రోగాల బారిన పడకుండా ఉండాలంటే మండలాన్ని వెలిగొండ ఆయకట్టు పరిధిలోకి చేర్చేలా తీర్మానం చేయాలని ఆయన కోరారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

దొనకొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి 19వ తేదీ వరకు రెండు బ్యాచ్‌లుగా మండలంలోని అధికారులకు, ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు. 16, 17 తేదీల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులు, వెల్ఫేర్, ఎడ్యుకేషన్, అగ్రికల్చర్, ఎనర్జీ, వెటర్నరీ అసిస్టెంట్స్, మహిళా పోలీసులకు శిక్షణ తరగతులు జరుగుతాయని తెలిపారు. 18, 19 తేదీల్లో మండలస్థాయి అధికారులు, వీఆర్వోలు, డిజిటల్, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, ఏఎన్ఎంలకు అభివృద్ధి కార్యక్రమాల అమలు, ఇతర అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

దొనకొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని వెంకటాపురం గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. వెంకటాపురం గ్రామానికి చెందిన ఎరగొర్ల గోపి ద్విచక్ర వాహనంపై వెళ్తూ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. అటు వైపు వెళ్తున్న ప్రయాణికులు రోడ్డుపై రక్తపుమడుగులో పడిఉన్న యువకుడిని చూసి 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వెలుగొండయ్య, శ్రీనులు హుటాహుటీన సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స చేసి దర్శి ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించినట్లు సమాచారం.

ఆరోగ్య కేంద్రం రహదారికి మోక్షం

- కొన్ని సంవత్సరాలుగా రాకపోకలకు ప్రజల ఇబ్బందులు
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- నేడు 'కూటమి' చొరవతో సిమెంట్ రోడ్డు నిర్మాణం


నాడు వైసీపీ పాలనలో అధ్వానంగా ఉన్న ఆరోగ్య కేంద్రానికి వెళ్లే రహదారి(ఫైల్)


టీడీపీ కూటమి ప్రభుత్వంలో నిర్మాణమైన సిమెంట్ రోడ్డు

దొనకొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): దొనకొండలోని ప్రభుత్వ ఆరోగ్యకేంద్రానికి వెళ్లే రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. కొన్ని సంవత్సరాలుగా ఈమార్గం అధ్వానంగా ఉంది. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో ప్రజల కష్టాలు తీరాయి. గ్రామాల అభివృద్ధిలో బాగంగా చేపట్టిన పల్లెపండుగ కార్యక్రమంతో ఆరోగ్యకేంద్రానికి వెళ్లేమార్గంలో సిమెంట్ రోడ్డు నిర్మించారు.

గతంలో ఈ రహదారిపై వర్షం కురిస్తే ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ద్విచక్ర వాహన చోదకులు బురదలో జారిపడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఈమార్గంలో వీపీపురం, బాదాపురం, రామిరెడ్డిపల్లి, పోలేపల్లి తదితర గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు జరుపుతుంటారు. మండలంలోని అనేక గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ ఆరోగ్యపరమైన అవసరాల నిమిత్తం ప్రభుత్వ ఆరోగ్యకేంద్రానికి వస్తుంటారు. ఇటువంటి ప్రధాన రహదారి అభివృద్ధిని, ప్రజల ఇబ్బందులను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యధోరణితో గాలికొదిలేసింది. వైసీపీ పాలనలో పాలకులకు, అధికారులకు ప్రజలు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న నాథుడే లేదు. నేడు టీడీపీ కూటమి ప్రభుత్వ పాలకులు ప్రజల ఇబ్బందులు గుర్తించి రూ.10 లక్షలతో సిమెంట్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు చేపట్టి పూర్తిచేశారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి పరిష్కరించటంలో టీడీపీ కూటమి ప్రభుత్వ పనితీరును ప్రత్యక్ష్యంగా చూసిన ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు తొలిగాయి



- బత్తుల బ్రహ్మయ్య, ఎర్రబాలెం

నాడు వర్షం కురిసిన సమయంలో ఆరోగ్యకేంద్రానికి వెళ్లేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారు. గత వైసీపీ ప్రభుత్వంలో పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారానికి నోచుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఈసమస్యను ప్రత్యక్షంగా చూశారు. ఇటీవల వర్షం కురిసిన సమయంలో ఆరోగ్య కేంద్రంలో జరిగే కార్యక్రమానికి హాజరై బురదమయమైన రహదారిని చూసి స్పందించి వెంటనే సిమెంట్ రోడ్డు మంజూరుకు చర్యలు చేపట్టారు. దీంతో ఏళ్ల తరబడి ప్రజల రాకపోకల సమస్య పరిష్కారమైంది.

అమరజీవి త్యాగాలు మరువలేనివి!

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి త్యాగాలు మరువలేనివని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక రామాలయం వీధిలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు తన ప్రాణాన్ని పణంగా పెట్టి సాధించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని అన్నారు. అలాంటి మహనీయుడు మన ప్రాంతంలోని పీసీపల్లి మండలంలో జన్మించారన్నారు. తమిళనాడు రాష్ట్రంలో తెలుగు మాట్లాడే వారిపై ఎంతో చిన్న చూపు ఉండేదని గుర్తుచేశారు. ఆ చిన్నచూపును భరించలేని పొట్టి శ్రీరాములు ప్రత్యేక తెలుగు రాష్ట్రం కావాలని పోరాటం చేశారని గుర్తుచేశారు. తమిళనాడు రాష్ట్రం నుంచి విడగొట్టి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలని తెలుగువారందరిని ఉద్యమించేలా చేసేందుకు ఆయన ప్రాణాల్నే పణంగా పెట్టారన్నారు. ఆయన మరణం తెలుగు వారందరినీ కదిలించి ఉద్యమించేలా చేసిందన్నారు. ఆయన మరణానంతరం ఆంధ్రరాష్ట్రం అవతరించిందన్నారు. ఆయన త్యాగనిరతిని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకుని పుట్టిన ప్రాంతం అభివృద్ధికి పాటుపడాలన్నారు. అమరజీవి లాంటి మహనీయుల ఆదర్శంతోనే కనిగిరి ప్రాంత అభివృద్ధికి తాను కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, ఐవీ నారాయణ, ఒలేటి చిన్నా, కేవీఎస్ గౌడ్, రాచపూడి వెంకటేశ్వర్లు, కొప్పరపు సత్యాలు తదితరులు పాల్గొన్నారు.

కాగా, స్థానిక కాశినాయన ఆరాధనా మహోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చేతులమీదుగా స్వాములకు, వృద్ధులకు ఉచితంగా దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తమ్మినేని చినరామిరెడ్డి, పులి శ్రీనివాసులురెడ్డి, సుబ్రమణ్యం, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దర్శిలో.. దర్శి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి వేడుకలు ఆదివారం దర్శిలో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే పాపారావు, జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు సూరె సుబ్బారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 58 రోజులు అమరణ నిరాహర దీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన త్యాగనిరతిని, పట్టుదలను అందరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి బొగ్గవరపు సుబ్బారావు, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భూమా సుబ్బారావు, కార్యదర్శి ఎన్నుమూరి రాము, కె.సాయి, సూర్యకిరణ్, కొల్లా భాస్కర్, అచ్యుత సత్యం, సీహెచ్ బసవయ్య దేవతి ప్రసాద్, మునగా అరుణ్, కొల్లా చెంచయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర


దర్శి: పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, సూరె సుబ్బారావు తదితరులు

ముండ్లమూరులో.. ముండ్లమూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేశారని ఏఎస్ఐ ఎస్.వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ఆదివారం ముండ్లమూరులోని బస్టాండ్ సెంటర్‌లో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్ఐ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు ఆశయాలు నేటి యువత కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పులికొండ శ్రీనివాసరావు, దేవతి వరప్రసాద్, వలేటి రమేష్, కన్నెగంటి సుధాకర్, శికాకుల సుబ్బారావు, పులికొండ శ్రీనివాసరావు, అమరా సురేష్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పామూరులో.. పామూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేమని వాసవీ క్లబ్ గవర్నర్ మంచికంటి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం స్థానిక వాసవీమాత దేవస్థానం వద్ద ఉన్న అమరజీవి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దరిశి మస్తాన్‌రావు, కోట నరసింహారావు, గురు, సోమిశెట్టి నరసింహారావు, శేగు కృష్ణయ్య, బచ్చు లీలాకృష్ణ దంపతులు, వాసవీక్లబ్ మహిళలు పాల్గొన్నారు.

కురిచేడులో.. కురిచేడు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత పోలీస్ స్టేషన్ సమీపంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం నేతలు, తెలుగుదేశం పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కొత్తా అయ్యప్పశెట్టి, కొలిసెట్టి కాశీవిశ్వనాధరావు, నాగేశ్వరరావు, బీజేపీ నాయకుడు ప్రసాదరావు, టీడీపీ నాయకులు మొఘల్ మస్తాన్‌వలి, కమతం నాగిరెడ్డి, దాసరి రవి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వర్ధంతిని విస్మరించిన అధికారులు

తాళ్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రం ఏర్పాటుకోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను అధికారులను విస్మరించారు. అమరజీవి వేడులను నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నా మండలంలోని ఒక్క ప్రభుత్వ కార్యాలయంలో కూడా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు.

గత కొంత కాలంగా అధికారులు జాతీయ నాయకుల జయంతి, వర్ధంతిలను జరపకపోవటం పట్ల ప్రజలు పెదవి విరుస్తున్నారు.

పొట్టి శ్రీరాములు బంధువులకు సీఎం సన్మానం



పొట్టి శ్రీరాములు బంధువులను సన్మానిస్తున్న సీఎం చంద్రబాబు

ముండ్లమూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన గునుపూడి సుబ్రహ్మణ్యం, గునుపూడి నరసింహారావు, గునుపూడి హనుమంతరావులను ఆదివారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఘనంగా సన్మానించారు. మండలంలోని మారెళ్ల గ్రామానికి చెందిన తన మేనత్త కుమార్తె సీతను పొట్టి శ్రీరాములు వివాహం చేసుకొని కొన్నాళ్ళపాటు మారెళ్ళలో ఉన్నారు. అదే గ్రామంలోని దిరిశాల వెంకటరమణారెడ్డి ఆస్పత్రి నిర్మాణంలో ప్రధాన పాత్ర శ్రీరాములు పోషించటంతో అందుకు గుర్తుగా ఆయన బంధువులను ముఖ్యమంత్రి సన్మానించి మెమెంటోలు అందజేశారు. అలాగే, తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, ఆర్ఐ పీవీఎస్ఆర్ మూర్తి పొట్టి శ్రీరాములు బంధువులైన గునుపూడి సుబ్రహ్మణ్యం, నరసింహారావు, హనుమంతరావులను సన్మానించారు.

రైతులకు మెరుగైన సేవలందించాలి

- కోల్డ్ స్టోరేజ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యేలు


కోల్డ్ స్టోరేజ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు ఉగ్ర, కాకర్ల

పామూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కనిగిరి, ఉదయగిరి లాంటి వెనుకపడిన నియోజవర్గాల్లో రైతులు పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్ ధరలకు అమ్ముకొనేందుకు కోల్డ్ స్టోరేజ్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని శాసనసభ్యులు డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి, కాకర్ల సురేష్ అన్నారు. ఆదివారం నెల్లూరు జిల్లా వరికుంటపాడు మండలం కనియంపాడు గ్రామం వద్ద నిర్మించిన పువ్వాడి రాధాకృష్ణ కోల్డ్ స్టోరేజ్‌ను వారు ప్రారంభించారు. ముందుగా స్వర్గీయ రాధయ్య చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మెట్ట ప్రాంతం అయిన ఉదయగిరి, కనిగిరి నియోజకవర్గాల సరిహద్దులో పువ్వాడి కుటుంబ సభ్యులు కోల్డ్‌స్టోరేజ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రైతు ప్రయోజనాలకు కోల్డ్ స్టోరేజ్ నిర్వాహకులు అధిక ప్రాధాన్యత ఇచ్చి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో టీడీపీ పామూరు, వరికుంటపాడు మండలాల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, చంద్ర మధుసూదనరావు, తెలుగురైతు ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు ఏలూరి వెంకటేశ్వర్లు, మన్నం రమణయ్య, జి.దశరథరామయ్య, పువ్వాడి తిరుపతమ్మ, రావెళ్ల నాగేంద్ర, బొల్లా మహాలక్ష్మమ్మ, ఎంహసేన్‌రావు, బొల్లా నరసింహారావు పాల్గొన్నారు. అలాగే, టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, సయ్యద్ అమీర్‌బాబు, షేక్ ఖాజారహంతుల్లా, పువ్వాడి జయమ్మ, డి.కొండబాబు, నిర్వాహకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, పువ్వాడి రామారావు, పువ్వాడి రామకృష్ణ, గోళ్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామంతో గుండె జబ్బులు దూరం

పామూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రతిరోజు క్రమంతప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా గుండె జబ్బులను నివారించవచ్చునని ఒంగోలు మెడికేర్ మల్టీ స్పెషాలిటీ వైద్యశాలకు చెందిన కార్డియాలజీ వైద్యులు డాక్టర్ కె.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. స్థానిక గద్దె ఏడుకొండలు హాస్పిటల్ (అశ్విని హాస్పిటల్)లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చాతిలో నొప్పి, చెమటలు పట్టడం, ఎడమచేతివైపు నొప్పి రావడం, తలతిరగడం, చిన్న పిల్లలకు గోళ్లు నీలంగా మారడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే గుండె వైద్యుడిని సంప్రదించి మెరుగైన వైద్యం పొందాలన్నారు. పామూరులోని అశ్విని వైద్యశాలలో ప్రతినెలా మూడో ఆదివారం తక్కువ ఖర్చుతో గుండె పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈసందర్భంగా సుమారు 40 మందికి గుండె పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

దర్శి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఖైదీలు సత్ప్రవర్తనతో మెలిగితే శిక్ష తగ్గించే అవకాశం ఉంటుందని జిల్లా న్యాయాధికారి భారతి తెలిపారు. స్థానిక సబ్‌జైల్లో ఆదివారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన పొరపాట్లతో జైలు జీవితాలు గడుపుతున్న ఖైదీలు మంచి పౌరులుగా మారాలని సూచించారు. చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పేదలకు ఉచిత న్యాయం అందించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దర్శి సీనియర్ సివిల్ న్యాయాధికారి శివశంకర్‌రెడ్డి, సబ్ జైలు సూపరింటెండెంట్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడుపరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎన్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్ పంతులు, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జి.వాసుబాబు, ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

నారాయణ స్వామికి..

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, విశేషపూజలు నిర్వహించారు. స్వామివారికి మహానైవేద్యాన్ని సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. అనంతరం గోశాలలోని గోవులకు పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో చైర్మన్ కొమ్మినేని చినఆదినారాయణ, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కాగా, పామూరు మండలం రేణిమడుగు గ్రామంలోగల లక్ష్మీదేవి సరస్వతిదేవి సమేత అంకాల పరమేశ్వరి ఆలయం తృతీయ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టారు. సోమవారం రుద్రాభిషేకం, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గుంటిగంగ దేవస్థాన ఈవోగా గుంటుపల్లికి అదనపు బాధ్యతలు

తాళ్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటిగంగ దేవస్థాన అదనపు ఎగ్జిక్యూటివ్ అధికారిగా గుంటుపల్లి వాసుబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో కార్తీక్ కందుకూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వివిధ దేవాలయాల ఈవోగా పనిచేస్తున్న వాసుబాబుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో గుంటిగంగ దేవస్థాన కమిటీ చైర్మన్ కొసరా గురుబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈవో వాసుబాబు మాట్లాడుతూ గుంటిగంగమ్మ దేవస్థాన అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి విరాళం

తాళ్లూరు, డిశంబరు 15 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన గుంటి గంగమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న అన్నదాన సత్రం నిర్మాణానికి గంగపాలెం గ్రామానికి చెందిన వైద్యులు డాక్టర్ బాలాజీ ఆదివారం రూ.27 వేల నగదును చైర్మన్ గురుబ్రహ్మంకు అందజేశారు. మండలంలోని గంగపాలెంగ్రామానికి చెందిన పటాన్ బాలాజీ కుటుంబీకులు గంగమ్మ తల్లిభక్తులు. వృత్తిరీత్యా మైసూర్‌లో స్థిరపడ్డారు. ఆదివారం అమ్మ వారిని దర్శించుకుని విరాళం అందజేశారు. కార్యక్రమంలో బాలాజీ తండ్రి పటాన్ మీరా సాహెబ్, ప్రకాష్ పంతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాశీనాయనస్వామి ఆరాధన మహోత్సవం

తాళ్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంటిగంగాభవాని పుణ్యక్షేత్రం పరిధిలోని కాశీనాయనస్వామి దేవాలయాల్లో ఆదివారం ఆరాధన మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా కాశీనాయనను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 7గంటల సమయంలో గణపతి పూజ, ప్రత్యేక అభిషేకాలు జరిపారు. పరిసర గ్రామాల మహిళా కళాకారులు కోలాట ప్రదర్శన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కాశీనాయనను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

దొనకొండలో.. దొనకొండ, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి పర్యవేక్షణలో ఆదివారం ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు మణిబాబు స్వామివారికి పంచామృత అభిషేకాలు, తదితర పూజలు నిర్వహించి మహానైవేద్యం సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కోడిపందెం స్థావరాలపై దాడి

తాళ్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగంబొట్లపాలెం కొండపొలాల్లో కోడి పందెం స్థావరంపై ఎస్సై ఎస్.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. పందేలు వేస్తున్న పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారినుంచి 5 పందెపు కోళ్లు, రూ.16 వేల నగదు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్శి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్సై తెలిపారు.

మరో ఘటనలో ముగ్గురు అరెస్టు

పామూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకపాడు పొలాల్లో కోడి పందేలు వేస్తున్న ముగ్గురిని ఎస్ఐ టి.కిశోర్‌బాబు తన సిబ్బందితో ఆదివారం దాడిచేసిన అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి మూడు పందెపు కోళ్లు, రూ.3,500 నగు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

పామూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఆరుగురిని ఆదివారం రాత్రి ఎస్ఐ అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని తూర్పుకోడిగుడ్లపాడులో పేకాట ఆడుతున్నట్టు సమాచారం అందడంతో ఎస్ఐ టి.కిశోర్ బాబు సిబ్బందితో కలిసి దాడిచేశారు. ఆరుగురిని అరెస్టు చేసి రూ.8,430 నగదు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.


లారీ ఢీకొని దంపతులకు తీవ్రగాయాలు

కనిగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని దంపతులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని నందనమారెళ్ళ వద్ద ఆదివారం చోటుచేసుకుంది. ఎస్ఐ టి.శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం.. పొన్నలూరు మండలం కోటపాడు గ్రామానికి చెందిన చిన్నపరెడ్డి ఓ శుభకార్యానికి భార్య పద్మతో మోటారుసైకిల్‌పై వెళుతున్నారు. ఈక్రమంలో నందనమారెళ్ళ గ్రామం వద్ద టిప్పర్ రోడ్డు మలుపు తిరుగుతుంది. దీంతో బైకు లారీని ఢీకొట్టడంతో అదుపుతప్పి కిందపడ్డారు. చిన్నపరెడ్డి తలకు బలమైన గాయమవ్వగా, భార్య పద్మ మోకాలు విరిగింది. తీవ్ర రక్తస్రావం అవుతున్న ఇరువురిని 108 అంబులెన్స్ ద్వారా పొదిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలి

కనిగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలని ఎంఈవోల సంఘం అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి అన్నారు. ఆదివారం జరిగిన స్థానిక సాయికృష్ణ దివ్యాంగుల సంక్షేమ సంఘం తొలి వార్షికోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. దివ్యాంగులు మానసిక దృఢ సంకల్పంతో తమలో ఉన్న శారీరక దివ్యాంగాన్ని జయించి రాణించాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ సంఘం నాయకులు నరసయ్య, శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ, శివరామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌కు జాతీయ సేవారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న శ్రీధర్

కనిగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న గుత్తి శ్రీధర్ జాతీయ సేవారత్న అవార్డు అందుకున్నారు. ఆదివారం ఢిల్లీలోని ఆంధ్ర అసోసియేషన్ ఆడిటోరియంలో బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబ్రమణియన్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
సోమవారం 16 డిసెంబరు 2024



> కొండనాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడిన చందాన, గత ప్రభుత్వం గోదాముల విషయంలో వ్యవహరించిన తీరు ప్రస్తుతం అన్నదాతలకు అది శాపంగా మారింది. మార్కెటింగ్ కమిటీల కింద గోడౌన్‌లను లీజు ప్రాతిపదికన ప్రైవేటు వ్యక్తులకు అద్దెకిచ్చే ప్రక్రియను గత ఏలుబడిలో చేపట్టారు. మరో వైపు ఆర్బీకేలకు అనుసంధానంగా గోడౌన్‌ల నిర్మాణం అంటూ హడావిడి చేసింది. ఇవి పూర్తి కాకపోగా ఉన్న గోదాములను రైతులకు అక్కరకు రానీయకుండా లీజు పాలు చేసింది.


- పెట్రోల్ బంకుల్లో కనీస వసతులు కరువు
- టైర్లలో గాలి, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ సహా 6 రకాల ఉచిత సేవలు
- వాటిని ఏమాత్రం అమలు చేయని బంకు నిర్వాహకులు
- పర్యవేక్షణ, తనిఖీలు కొరవడడంతో నిబంధనలకు తిలోదకాలు
- వినియోగదారుల అవగాహనపై అధికారుల నిర్లక్ష్యం



గుంటూరు : ఇన్నర్ రింగురోడ్డులోని పెట్రోలు బంకులో పనిచేయని గాలి నింపు యంత్రం

సదుపాయాలేవి?

జిల్లాలో పెట్రోలు బంకుల నిర్వహణ అధ్వానంగా వుంది. కేవలం లాభాలు పొందడం తప్ప వినియోగదారులకు అందించాల్సిన కనీస సేవలు కూడా అందించకుండా నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు బంకు నిర్వాహకులు. దీంతో ప్రతిరోజూ లక్షల రూపాయల లావాదేవీలు జరుగుతున్న పెట్రోల్‌బంకుల్లో వినియోగదారులకు అందాల్సిన కనీస సదుపాయాలు కూడా అందడం లేదు. బంకుల్లో ఇంధనాన్ని విక్రయించడమే కాదని, ఇంధన వినియోగదారులకు పలురకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసినా జిల్లాలో వాటిని పట్టించుకునేవారే లేరు. నిబంధన అమలుకు పూనుకోవాల్సిన అధికారులు వాటిని ఏమాత్రం పట్టించుకోకపోవడంతో ఉమ్మడి గుంటూరు జిల్లాలో వున్న 300కు పైగా పెట్రోలు బంకుల్లో 90 శాతానికి పైగా పెట్రోలు బంకుల్లో నిర్వాహకులు యథేచ్ఛగా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు.


గుంటూరు : పట్టాభిపురం మెయిన్ గేటు వద్ద పెట్రోలు బంకులో పనిచేయని గాలిపంపు


గుంటూరు : లాడ్జి సెంటర్లో పక్కన పెట్టిన వాటర్ ట్యాంకు

గుంటూరు, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెట్రోల్‌బంకుల్లో వినియోగదారుల వాహనాల టైర్లకు గాలిని ఉచితంగా నింపాలి. ప్రతీబంకులో గాలి నింపే యంత్రం విధిగా ఉండాలి. కానీ చాలా చోట్ల అవి వుండడం లేదు. ఒక వేళ ఉన్నా వాటిని సక్రమంగా నిర్వహించడం లేదు. నూటికి 90 చోట్ల అవి పనిచేయని స్థితిలోనే ఉన్నాయంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో ఇట్టే చెప్పవచ్చు. గాలి పంపుల నిర్వహణకు ఒక ఉద్యోగిని ప్రత్యేకంగా కేటాయించాల్సి వస్తుండడంతో ఆ సేవను పూర్తిగా నిలిపివేస్తున్నారు. జిల్లా కేంద్రం సహా పలు నగరాలు, పట్టణాల్లో ఉండే పెట్రోలు బంకుల్లో ఇదే పరిస్థితి. శివారు ప్రాంతాల్లోని బంకుల్లోకి లారీలు, ట్రక్కుల వంటి భారీ వాహనాలు వస్తుంటాయి. వాటికి కూడా గాలి నింపేందుకు నిర్వాహకులు తిరస్కరిస్తున్నారు. చాలాచోట్ల యంత్రాలు కనిపించకుండా ఏర్పాటు చేసి వాడకుండా వదిలేస్తున్నారు. చాలా చోట్ల బలవంతగా డబ్బు వసూలు చేస్తున్నారు. ద్విచక్రవాహనానికి టైరుకు రూ.5 నుంచి 10, కార్లు, ఇతర భారీ వాహనాలకు టైరుకు రూ.10 చొప్పున వసూలు చేస్తున్నారు. నిర్వాహకులపై భారం పడకుండా ఇంధన సంస్థలే గాలి యంత్రాలను ఏర్పాటు చేసినా నిర్వాహకులు ఇలా చేయడం దారుణం.

● మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు

ప్రతీ పెట్రోలు బంకులో మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలి. చాలామంది బంకుల నిర్వాహకులు వాటిని నిర్వహించడం లేదు. చాలా చోట్ల మూత్రశాలల బోర్డులు పెట్టి సరిపుచ్చారు. ఒక వేళ మరుగుదొడ్లు ఉన్నా వాటి నిర్వహణ లేకపోవడంతో అవి నిరుపయోగంగానే పడివుంటున్నాయి. చాలాబంకుల్లో అవి సిబ్బంది కోసమే అన్నట్లు ఇతరులను అనుమతించడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సదుపాయం (మిగతా 8వ పేజీలో)

పంట నిల్వ ఎలా

గత ప్రభుత్వ పాపం...రైతులకు శాపం...!

- ప్రైవేటు వ్యక్తుల చేతిలో మార్కెట్ యార్డు గోదాములు
- అక్కరకు రాని బహుళ ప్రయోజన గోడౌన్‌లు
- ఆర్‌బీకేల పరిధిలో గోదాములంటూ గతంలో హడావుడి
- అయినకాడికి పంటను అమ్ముకుని నష్టపోతున్న రైతులు


పిచ్చి మొక్కలకు నిలయంగా మారిన కర్లపాలెం గ్రామంలో నిర్మించిన మల్టీ పర్పస్ గోడౌన్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బహుళ ప్రయోజన సౌకర్యాల కోసం గోదాముల నిర్మాణాన్ని గత ప్రభుత్వం చేపట్టింది. వీటిలో చాలా వరకు నిర్మాణాలను అసంపూర్తిగానే వదిలేసింది. అరకొరగా పూర్తయిన వాటిని కూడా రైతులకు అందుబాటులోకి తేవడంలో వహించిన నిర్లక్ష్యం ప్రస్తుతం రైతులకు శాపంగా మారిన దుస్థితి నెలకొంది. ప్రకృతి విపత్తుల సమయంలో చేతికొచ్చిన పైరును నిల్వ చేసుకునే వెసులుబాటు లేక అయినకాడికి అమ్ముకోవాల్సిన దీనస్థితిని గతంలో ఎదుర్కొన్నారు. ప్రస్తుతం దానిని చక్కదిద్దే పనిలో కూటమి పాలకులు ఉన్నప్పటికీ ఐదేళ్ల అలసత్వం తాలుకా ప్రభావం ఇప్పటికీ అన్నదాతలపై పడుతూనే ఉంది. తాజాగా తుఫాన్ హెచ్చరికలతో ధాన్యం రైతులు పంటను నిల్వ చేసుకోవడానికి పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. నిల్వ కోసం ప్రైవేటు గోదాములపైనే ఆధారపడిన వారు కొందరైతే ఆ ధర భరించలేని వారు తమ పంటను అయినకాడికి అమ్ముకుని తీవ్రంగా నష్టపోయారు. అస్తవ్యస్తమయిన గోదాముల వ్యవస్థను గాడిలో పెట్టడానికి కూటమి ప్రభుత్వం నడుం బిగించింది. దానిలో భాగంగా తొలుత గత ప్రభుత్వంలో గోడౌన్‌ల లీజు ఒప్పందాలను పునఃపరిశీలించి వాటిని రద్దు చేసే యోచనలో ఉంది. దానితో పాటు అసంపూర్తిగా వదిలేసిన బహుళ ప్రయోజన గోడౌన్‌లను త్వరితగతిన పూర్తి చేసి గత ప్రభుత్వ పాపాలను ప్రక్షాళన చేసే పనిలో అధికారులు నిమగ్నమయి ఉన్నారు

> బాపట్ల జిల్లాలో మొత్తం 43 గోదాములకు అనుమతులు మంజూరు కాగా వీటిలో నిర్మించినది 20 మాత్రమే కాగా మిగిలినవి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్నాయి. ఇక గుంటూరు జిల్లాలో 30 గోదాముల నిర్మాణానికి అనుమతులు రాగా పూర్తయింది 22 మాత్రమే. పల్నాడు జిల్లాలో 47 మంజూరు కాగా నిర్మాణం పూర్తయింది 23గా ఉన్నాయి.

అలా వదిలేశారు....

పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడానికి నిర్మించిన మల్టీ పర్పస్ గోడౌన్‌లు అన్నదాతలకు అక్కరకు రాకుండాపోయాయి. పూర్తి అయిన గోదాములను అన్నదాతలకు అందుబాటులోకి తేవడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో అవి ఇప్పుడు పిచ్చిమొక్కలకు ఆవాసాలుగా మారి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇక వివిధ దశల్లో నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్న వాటి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఇప్పటికే లక్షల రూపాయల ప్రజాధనం వాటిపై వెచ్చించినప్పటికీ నిర్మాణాల విషయంలో తగు జాగ్రత్తలు (మిగతా 8వ పేజీలో)

ఎయిమ్స్‌లో ముగిసిన కాడెరిక్ వర్క్‌షాపు


వర్క్‌షాపులో పాల్గొన్న ప్రముఖ వైద్యులు

మంగళగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఎయిమ్స్ ఆసుపత్రిలో రేడియో డయాగ్నోసిస్, అనాటమీ విభాగాల ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగిన ఇమేజ్ గైడెడ్ మస్క్యులో స్కెలెటల్ ఇంటర్వెన్షన్‌లపై కాడెరిక్ వర్క్‌షాపు ఆదివారంతో ముగిసింది. ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్, ది మస్క్యులో స్కెలెటల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాపు జరిగింది. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 80 మంది ప్రముఖ వైద్యులు, వివిధ దేశాల నుంచి పది మంది అధ్యాపకులు హాజరై తమ అనుభవాలను పంచుకున్నారు. అత్యాధునిక ఎంఎస్‌కే అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబానందకర్, అకడమిక్స్ డీన్ డాక్టర్ శ్రీమంత్‌కుమార్ దాస్, ఐఆర్‌ఐఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ జైరాజ్, డాక్టర్ జాయ్ ఘోషల్, డాక్టర్ పృథ్వీనాథ్, డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ యుగంధర్, డాక్టర్ మిథిలేష్, కిషోర్, చైతన్య, భావన తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం కోసం ముఖ్యమంత్రి కృషి

● ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్


సభలో మాట్లాడుతున్న ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్


రాజశేఖర్‌బాబును సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు నక్కా ఆనందబాబు, ఏలూరి సాంబశివరావు, వేగేశన నరేంద్రవర్మ తదితరులు

బాపట్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశేష కృషి చేస్తున్నట్లు ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తెలిపారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్‌గా సలగల రాజశేఖర్‌బాబు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. జాయింట్ కలెక్టర్, బావుడా వైస్ చైర్మన్ ప్రఖర్‌జైన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అధ్యక్షత వహించారు. ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ నమ్మకంతో సలగల రాజశేఖర్‌బాబును బావుడా చైర్మన్‌గా ముఖ్యమంత్రి నియమించారన్నారు. సీఎం నారా చంద్రబాబునాయుడు అన్నివర్గాల వారికి సముచిత స్థానం కల్పించి పదవులు ఇస్తున్నట్లు చెప్పారు. బావుడా చైర్మన్ సలగల మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి సహకారం, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కృషితో టీడీపీలో చేరానన్నారు. ఎలాంటి పక్షపాతం లేకుండా చేయకలిగిన ప్రతిపని చేస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి, పెద్దల ఆశీస్సులతో ముందుకెళ్తానన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. రాష్ట్రాభివృద్ధి కాంక్షించే వారంతా టీడీపీ పక్షాన ఉండి పని చేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా సలగలను అతిథులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, రేపల్లె టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీ నారాయణ, జనసేన నాయకురాలు గుంటుపల్లి తులసీకుమారి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, రాష్ట్ర మహిళా ఆర్గనైజింగ్ సెక్రటరీ మానం విజేత, నియోజకవర్గ పరిశీలకులు సాంబిరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు పమిడి భాస్కరరావు, కళ్ళం హరినాథరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శులు తానికొండ దయాబాబు, పల్లం సరోజని, ఎస్సీసెల్ నాయకులు బడుగు నాగేశ్వరరావు, దగ్గుమల్లి కిరణ్‌కుమార్, సుభాషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ సొసైటీ ఎన్నికలకు సిద్ధం

● నేడు నామినేషన్‌ల ప్రక్రియ

బాపట్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యవర్గ ఎన్నికకు రంగం సిద్ధమైంది. రెండువర్గాల మధ్య బలమైన పోటీ నెలకొనే అవకాశం ఈ పర్యాయం కూడా ఉంది. మూడేళ్లపాటు కొనసాగే పదవులకు ముఖ్యనాయకులు పోటీ పడుతున్నారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగుతుందని సభ్యులు తెలియజేశారు. ఈ నెల 22వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి సెప్టెంబరు నెలలోనే పాలకవర్గం పదవీకాలం పూర్తయింది. అయినప్పటికి ఎన్నికల ప్రక్రియ ఆలస్యం కావటంతో వారే కొనసాగుతున్నారు. ముప్పలనేని శేషగిరిరావు వారసుడిగా ప్రస్తుత అధ్యక్షుడిగా ఉన్న ముప్పలనేని శ్రీనివాసరావు మళ్లీ పోటీకి సిద్ధమౌతున్నట్లు సమాచారం. మూడు దశాబ్దాలుగా ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శిగా ఉన్న మానం నాగేశ్వరరావు మళ్లీ కార్యదర్శిగా పోటీ చేయనున్నట్లు తెలిసింది. ఈ పర్యాయం అధ్యక్షునిగా దొప్పలపూడి రామ్మోహనరావు కూడా పోటీకి దిగుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయన ఉపాధ్యక్షునిగా ఉన్నారు.

గుంతలు తవ్వారు... మరమ్మతులు మరిచారు

- నిత్యం ప్రమాదాలు.. అల్లాడుతున్న వాహన చోదకులు



బాపట్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు దగ్గర నుంచి ఇంజనీరింగ్ కళాశాల వరకు బైపాస్‌రోడ్డును అనుసంధానం చేస్తూ రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పనులు చేసే సమయంలో రోడ్డు పక్కనే ఉన్న పైపులైన్‌లను పూర్తి స్థాయిలో ఆధునీకరించకుండా రోడ్డును విస్తరించారు. దీనివల్ల రోడ్డు కింద ఉన్న పైపులు అనేకచోట్ల దెబ్బతిన్నాయి. దీనివల్ల నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మరమ్మతులతో తాగునీటి సరఫరాలో అవాంతరాలు తలెత్తుతున్నాయి. మరమ్మతులు చేసేందుకు తవ్విన గుంతలను పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయకుండా మున్సిపల్ అధికారులు మట్టిపోసి వదిలేస్తున్నారు. దీనివల్ల మట్టిమెరకలు, పల్లాలుగా ఏర్పడి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ విషయంపై కమిషనర్ జి.రఘునాధరెడ్డి మాట్లాడుతూ, రోడ్డుకు ఇరువైపుల సుమారు 70చోట్ల పైపులైన్‌ల లీక్‌లు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. వీటన్నిటికి మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్‌ను ఏర్పాటుచేశామన్నారు. తవ్విన గుంతల విషయమై డీఈ కృష్ణారెడ్డిని వివరణ కోరగా రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్‌ను పిలిపించి మాట్లాడతామన్నారు. అప్పటివరకు గుంతలు సరిచేసి ప్రమాదాలు జరగకుండా చూస్తామని చెప్పారు.


బాపట్లలోని డీఎంపల్లి దగ్గర జీబీసీ రోడ్డుపై గుంతలు తవ్వి పైపులైన్ మరమ్మతులు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది


> నాడు - నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలే మార్చేశామని గత వైసీపీ ప్రభుత్వం నేటికీ డప్పు కొడుతున్నది. అయితే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని స్కూళ్లలో ఏ ఒక్కదానికి ఫైవ్‌స్టార్ రేటింగ్ రాకపోవడం ఆ ప్రోగ్రాంలోని డొల్లతనాన్ని బహిర్గతం చేస్తున్నది. కేవలం బ్లాక్‌బోర్డులు, బెంచీలు, అరకొరగా తరగతి గదులు, ప్రహరీ నిర్మాణాలకే కోట్లాది రూపాయలు దుబారాగా వెచ్చించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా అకడమిక్‌లో అయితే మరీ అధ్వాన పరిస్థితులు కనిపిస్తున్నాయి.

- మూడు జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి
- 2, 3 స్టార్‌లలోనే చాలా పాఠశాలలు
- అకడమిక్‌లో అయితే మరీ అధ్వానం



ఫైవ్ స్టార్‌లో.. ఒక్కటీ లేదు!

గుంటూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 18 సూచికలతో స్టార్ రేటింగ్స్‌ని పాఠశాలలకు ఇవ్వగా మూడు జిల్లాల్లోని స్కూళ్లు 2, 3 స్టార్‌లోనే నిలిచాయి. తరగతి గదుల్లో అవసరమైన మంచి వాతావరణం, ప్రహరీ, ఎలక్ట్రికల్, సోలార్ పరికరాలు, నీటి సౌకర్యంతో వేర్వేరు టాయ్‌లెట్స్, ఆర్‌వో వాటర్‌ప్లాంట్, తగిన వనరులతో లైబ్రరీ రూం, ఆటస్థలం, డస్ట్ బిన్‌లు, అన్ని తరగతి గదులకు ఫర్నిచర్, పూర్తిస్థాయి పరికరాలతో ల్యాబ్‌లు, హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కలిగిన క్లాస్ రూంలు, వినియోగంలో ఉన్న స్మార్ట్ టీవీ/ఇంటరాక్టివ్ ప్యానెల్స్, ఫంక్షనల్ కంప్యూటర్ ల్యాబ్‌లు, వంట గదులు, ఒకేషనల్ సదుపాయాలు, కిచెన్ గార్డెన్, ర్యాంపులు, ఈ-కంటెంట్ వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని సున్న నుంచి మొదలుకొని 5 వరకు స్టార్ రేటింగ్స్‌ని ప్రభుత్వం ఇచ్చింది.



గుంటూరు జిల్లాలో మొత్తం 1062 పాఠశాలలు ఉన్నాయి. వాటిల్లో ఫైవ్‌స్టార్ రేటింగ్‌లో ఒక్కటి కూడా లేదు. ఒన్ స్టార్‌లో 18, 2 స్టార్‌లో 293, త్రీస్టార్‌లో 510, 4 స్టార్‌లో 241 స్కూళ్లు స్థానం దక్కించుకొన్నాయి. బాపట్ల జిల్లాలో 1,431 స్కూళ్లకు ఒన్‌స్టార్‌లో 79, 2 స్టార్‌లో 606, త్రీస్టార్‌లో 581, ఫోర్‌స్టార్‌లో 165 పాఠశాలలకు రేటింగ్ లభించింది. పల్నాడు జిల్లాలో 1,581 స్కూళ్లకు ఒన్ స్టార్‌లో 11, 2 స్టార్‌లో 310, త్రీ స్టార్‌లో 842, ఫోర్ స్టార్‌లో 418 రేటింగ్స్ పొందాయి.

ఇదేవిధంగా అకడమిక్ పరంగానూ స్టార్ రేటింగ్స్ ఇచ్చారు. విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల అటెండెన్స్, ఎస్‌ఎస్‌సీ రిజల్ట్స్, సమ్మేటివ్ అసెస్‌మెంట్ ఫలితాల ఆధారంగా రేటింగ్స్ ఇచ్చారు. గుంటూరు జిల్లాలో 0 స్టార్ రేటింగ్‌లో కూడా రెండు స్కూల్స్ వచ్చాయి. ఒన్‌స్టార్‌లో 339, టూ స్టార్‌లో 639, త్రీ స్టార్‌లో 79, ఫోర్ స్టార్‌లో కేవలం మూడు మాత్రమే వచ్చాయి. ఫైవ్‌స్టార్ అనేది ఏ ఒక్క స్కూల్‌కి రాలేదు. పల్నాడు జిల్లాలో అయితే 10 స్కూళ్లకు సున్న రేటింగ్ వచ్చింది. ఒన్‌స్టార్ 569, టూస్టార్ 911, త్రీస్టార్ 89, ఫోర్ స్టార్ రెండు వచ్చాయి. బాపట్ల జిల్లాలో సున్న స్టార్ 15, ఒన్ స్టార్ 452, టూస్టార్ 801, త్రీస్టార్ 163 రాగా ఫోర్, ఫైవ్ స్టార్ రేటింగ్స్ ఏ ఒక్క స్కూల్‌కి రాలేదు. దీనిని బట్టి అకడమిక్‌లో ఏ కోశాన పురోగతి సాధించలేదని స్పష్టమవుతున్నది.

వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు టోఫెల్ కరిక్యులమ్ విద్యాబోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ అంటూ రూ. కోట్లు దుబారాగా ఖర్చు చేశారు. బైజూస్ కంటెంట్ అనే పేరుతో మరి కొంత ప్రజాధనాన్ని బూడిదలో పోశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అకడమిక్ పరంగా స్కూళ్లలో స్టార్ రేటింగ్స్ పెంచేందుకు ఐదు సూత్రాలను సూచించింది. ప్రధానంగా ఎక్కడైతే విద్యార్థులు 10 మంది కంటే తక్కువగా పాఠశాలల్లో ఉన్నారో అక్కడ వారి సంఖ్య పెంచాలని సూచించింది. అలానే విద్యార్థులు, ఉపాధ్యాయులు 80 శాతం హాజరు ఉండాలి. ఎవరైతే 60 శాతం కంటే తక్కువ స్కోరింగ్ చేస్తున్నారో వారిని గుర్తించి అదనపు తరగతులు నిర్వహించాలి. హెచ్‌ఎంలతో నెలవారీ సమీక్షలు నిర్వహించి ఎక్కడైతే లోపాలున్నాయో గుర్తించి వాటిని సవరించాలి. మండలస్థాయి అధికారులు తరచుగా పాఠశాలలను సందర్శించి వీక్లీ రిపోర్టులు నివేదించేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి

వేటపాలెం(చీరాల), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : దత్త క్షేత్రంలో ఆదివారం దత్త జయంతి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్త పరివార బృంద దత్త నామకీర్తనతో దత్తక్షేత్ర పరిసరాలు ప్రతిధ్వనించాయి. పూజా కార్యక్రమాల అనంతరం ప్రసాద వితరణ జరిగింది. ఆయల కమిటీ ప్రతినిధులు ప్రమీలాదేవి, ప్రత్తి వెంకటసుబ్బారావు పర్యవేక్షణలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా ఆదివారం లక్ష తమలపాకుల పూజను వైభవంగా నిర్వహించారు. సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం పూజలు నిర్వహించారు. అభిషేకం అనంతరం వేదపండితులు, అర్చకులు, ఉభయదాతలు ఆలయ ప్రదక్షిణ చేశారు. 11 ఆవృత్తములు గా దేవస్థానం వేదపండితులు, అర్చకులు లక్ష తమలపాకుల పూజ నిర్వహించారు. ఉభయదాతలుగా గుంటూరుకు చెందిన న్యూమార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

కనకనాగవరపమ్మకు ముక్కుపుడక బహూకరణ


బంగారు ముక్కుపుడకను ఈవోకు అందజేస్తున్న భక్తులు

వేటపాలెం(చీరాల), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రామన్నపేట పంచాయతీ పరిధిలో కొలువై ఉన్న శ్రీ కనక నాగవరపమ్మ అమ్మవారికి బంగారు ముక్కుపుడకను ఆదివారం భక్తులు పాకనాటి బలరామరెడ్డి, శివమ్మ దంపతులు బహూకరించారు. అమ్మవారి తరపున ఆలయ ఈవో పోతిని శ్రీనివాసరావుకు ఆ ముక్కుపుడకను అందజేశారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ భక్తులు సమకూర్చిన బంగారు ముక్కుపుడక ఖరీదు సుమారు రూ.21వేలు ఉంటుందని తెలిపారు. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పంట నిల్వ ఎలా?

(5వ పేజీ తరువాయి)

తీసుకోకపోవడంతో పాటు ఈ దుస్థితి తలెత్తిందనేది తెలుస్తోంది.

ఆదరాబాదరా నిర్ణయాలు

గత ప్రభుత్వంలో ఆలోచన వచ్చిందే తడవుగా పాలకుల నోట్లో నుంచి ప్రకటన వచ్చేది. వాటి సాధ్యాసాధ్యాల విషయంలో తగినంత కసరత్తు కానీ వివిధ శాఖల మధ్య సమన్వయం, వాటి పాత్ర వంటి వాటి గురించి శ్రద్ధ పెట్టిన పాపాన పోలేదు. ఈ గోదాముల నిర్మాణం విషయంలో మార్కెటింగ్ విభాగానికి, పీఏసీఎస్‌లకు మెలిక పెట్టడం కూడా ప్రతిబంధకంగా మారింది. ఎంపిక చేసిన గోదాముల నిర్మాణాన్ని పూర్తి చేసి వాటిని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల అధీనంలో రైతులకు ఇవ్వాలనేది గత ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలలో ఉన్నాయి. కానీ ఆచరణలో ఆ రెండు విభాగాల మధ్య సరైన సమన్వయం లోపించడం కూడా అన్నదాతల నిల్వ ఇక్కట్లకు కారణాలుగా ఉన్నాయి. మంజూరైన గోడౌన్‌లలో దాదాపు 65 శాతం పూర్తి అయినప్పటికీ వాటిని అన్నదాతలకు అందుబాటులోకి తేవడంలో గత ప్రభుత్వం వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది. ప్రస్తుత ప్రభుత్వం వాటిని సత్వరమే రైతులకు ఉపయోగం లోకి తేవాలన్న వైసీపీ ప్రభుత్వంలో అనేక సాంకేతిక పరమైన చిక్కులను వాటి నిర్మాణంలో పొందుపరచడంతో వాటన్నింటిని పరిష్కరించి అందుబాటులోకి తేవడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు ఆరంభించింది

ఉన్న గోదాములను లీజుకు

మార్కెట్ కమిటీల పరిధిలో ఉండే గోదాములను లీజుకిచ్చే తంతు గత ప్రభుత్వంలో నడిచింది. బాపట్ల జిల్లాలో 66 మార్కెటింగ్ విభాగం కింద 66 గోడౌన్‌ల ఉండగా వీటిలో 20 వరకు ఎప్పటి నుంచో ఎఫ్‌సీఐ, డీసీఎంస్ విభాగాలు అద్దె ప్రాతిపదికన వాడుకుంటుండగా, మిగలిన వాటిని కూడా ప్రైవేటు వ్యక్తులకు గత ప్రభుత్వంలో లీజుకిచ్చారు. దాదాపు 20 వరకు బాపట్ల జిల్లాలో ఇవ్వగా, ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే 50 వరకు గోదాములను ఇతరత్రా అవసరాలకు నామమాత్రపు ధరకు లీజుకిచ్చి రైతుల నోట్లో మట్టి కొట్టారు. ఓ వైపు రైతుభరోసా కేంద్రాల పరిధిలో గోడౌన్‌ల నిర్మాణమంటూ మరో వైపు ఉన్న వాటిని ప్రైవేటు వ్యక్తులకు లీజుకిచ్చే నిర్ణయాల పట్ల అప్పటి ప్రతిపక్షం టీడీపీ తీవ్ర అభ్యంతరం వెలిబుచ్చింది. ఇదిలా ఉంటే కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే లీజు గడువు ఉన్నప్పటికీ చాలా మంది ప్రైవేటు వ్యక్తులు గోడౌన్‌లు ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఉన్న పళంగా వాటిని స్వాధీనం చేసుకుని తిరిగి రైతులకు నిల్వ కోసం ఇవ్వడానికి సాంకేతిక పరమైన ఇబ్బందులు ఎదురవుతుండడంతో త్వరలోనే అన్ని గోదాములను అన్నదాతలు పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవడానికి అందుబాటులోకి తేనున్నారు

నిల్వకు ఖర్చు పెట్టే పరిస్థితిలో రైతులు లేరు

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అధిక ధర చెల్లించి ప్రైవేటు గోడౌన్‌లలో తమ పంటను నిల్వ చేసుకునే ఆర్థిక వెసులుబాటు రైతులకు లేకపోవడంతో అయినకాడికి తమ ఉత్పత్తులను అమ్ముకుని నష్టపోతున్నారు. తాజాగా తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి జిల్లాలోని వరి రైతులు తమ పంటను నిల్వ చేసుకునే అవకాశం లేక నానా ఇబ్బందులు పడిన సంగతి విదితమే. దాదాపు పదివేల మెట్రిక్ టన్నుల ధాన్యం దళారుల పాలు కావడం వెనక అన్నదాతలకు నిల్వ సౌకర్యం లేకపోవడమే కారణంగా ఉంది. ఇప్పటికైనా జిల్లాలో మార్కెటింగ్ శాఖ పరిధిలో ఉన్న గోడౌన్లను నామమాత్రపు అద్దెతో రైతులు ఉపయోగించుకునేలా చర్యలు చేపట్టడంతో పాటు నిర్మాణం పూర్తయిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములను సైతం తమకు అందుబాటులోకి తెస్తేనే నిల్వ కష్టాల నుంచి గట్టెక్కుతామనే అభిప్రాయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా రైతాంగం వెలిబుచ్చుతోంది.

అమరజీవికి ఘన నివాళి


అద్దంకి టీడీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్‌లు, టీడీపీ నేతలు

అద్దంకి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని టీడీపీ అద్దంకి పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్థంతిని ఆదివారం పోతురాజుగండి వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీ నేతలు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు వర్థంతిని కూటమి ప్రభుత్వం ఆత్మార్పణ సంస్మరణ దినంగా నిర్వహిస్తుందన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ, ఆర్యవైశ్య సంఘం నేతలు పాతబస్టాండ్ సెంటర్, పాత గాంధీ బొమ్మసెంటర్, శింగరకొండ ఆర్యవైశ్య నిత్య అన్నదాన సత్రాలలో పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కౌన్సిలర్‌లు అత్తులూరి రమేష్, విజయలక్ష్మి మాధవరావు, జహీరా, లహరి, గోపి, గార్లపాటి శ్రీనివాసరావు, రామాంజనేయులు, కురిచేటి శంకరరావు, భోజనపల్లి సత్యనారాయణ,కూరపాటి రామకోటేశ్వరరావు,మలాది శ్రీనివాసరావు, దేవపాలన, బాషా, రఫీ పాల్గొన్నారు.

చీరాల : అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని పలు రాజకీయ పార్టీలు, సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. అమరజీవి వర్థంతి సందర్భంగా ఆదివారం కామధేను కాంప్లెక్స్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు, పలు సంఘాల ప్రతినిధులు వేర్వేరుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా సందర్భాల్లో వారు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర అవతరణకు పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని మననం చేశారు.

వేటపాలెంలో : పొట్టి శ్రీరాములు వర్థంతి ఆయన విగ్రహానికి ఎస్సై వెంకటేశ్వర్లు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. పలు పార్టీల నాయకులు, సంఘాల ప్రతినిధులు వేరు,వేరుగా అమరజీవి విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములను స్మరించుకున్నారు.

పంగులూరు : తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగధనుడని పలువురు కొనియాడారు. ఆర్యవైశ్య సంఘ ప్రతినిధులు అమరజీవి పొట్టి శ్రీరాములు వర్థంతి కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కూడలిలోని శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ నేత పోలిశెట్టి సీతారామయ్య పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, సుబ్బారావు, వెంకటరావు, సోము భాస్కరరావు, పోలిశెట్టి రామచంద్రరావు, శ్రీనివాసరావు, వెంకటరావు పాల్గొన్నారు.

ఆంధ్రరాష్ట్రసాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు అని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కొనియాడారు. ఆదివారం ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఏలూరి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, కోటపాటి సురేష్, పెంట్యాల శ్రీను పాల్గొన్నారు.

చినగంజాం : పొట్టి శ్రీరాములు వర్థంతిని మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిర అవరణలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కోట శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాఖ గ్రంథాలయం చినగంజాంలో గ్రంథపాలకులు మోహనలక్ష్మీనరసింహాచార్యులు శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు, ఉపాధ్యాయులు ఆర్ఎస్‌వీ.పోతురాజు, వై.రామాంజనేయులు, విద్యార్థులు, ఆర్యవైశ్య స్టేట్ కౌన్సిల్ సభ్యులు అమరా శ్రీనివాసులు, నాయకులు బెల్లంకొండ రమేష్ బాబు, అమరా మోహన్‌రావు, వాసవీ వనితా క్లబ్ మండల అధ్యక్షురాలు కోట సుచిత్ర, కార్యదర్శి భయ్యా జ్యోతి, కోశాధికారి మోటుమర్రి శేషకుమారి, అమరా నాగలక్ష్మి పాల్గొన్నారు.

పర్చూరు : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్థంతి సందర్భంగా కొట్లబజారు ఏర్పాటు చేసిన శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడు మామిడిపాక హరిప్రసాద్, ఆర్యవైశ్య సంఘ నాయకులు శ్రీరాం వెంకటసుబ్బరావు, పి.వెంకటేశ్వరరావు, పూర్ణ, సిద్దయ్య, శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రైతు సేవకే ప్రాధాన్యం ఇవ్వాలి

నీటి సంఘాల సభ్యులకు

ఎమ్మెల్యే ఏలూరి సూచన


కోనంకి నీటి సంఘాల అధ్యక్షులను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

మార్టూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతుల పంటలకు సాగు నీటిని సక్రమంగా అందిస్తూ వారి సేవలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నీటి సంఘం అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. శనివారం పర్చూరు నియోజకవర్గంలో జరిగిన సాగు నీటి సంఘాల ఎన్నికలలో టీడీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా, కమిటీ మెంబర్లుగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల కమిటీ అధ్యక్షులు ఆదివారం మండలంలోని ఇసుకదర్శి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలిపారు. ఈ సందర్భంగా ఏలూరి కొత్త కమిటీ అధ్యక్షులను, కమిటీ సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి పెద్దపీట వేసిందన్నారు. రైతులు వ్యవసాయంలో లాభసాటిగా ఉండడానికి ప్రభుత్వం రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అదేవిధంగా క్షేత్ర స్థాయిలో రైతులు కోసం నీటి సంఘాల కమిటీలు పూర్తి సహకారం అందించాలన్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న కోనంకి, ద్రోణాదుల, పర్చూరు, ఇంకొల్లు డిస్ట్రిబ్యూషన్ కమిటీ అధ్యక్షుల ఎన్నిక పూర్తయిన తర్వాత పూర్తి స్థాయిలో రైతుల కోసం చేసే సేవలపై నీటి సంఘాల అధ్యక్షులు దృష్టిసారించాలన్నారు. ఇదిలావుండగా ఎమ్మెల్యే ఏలూరిని కలిసిన వారిలో కోనంకి 1, 2 సాగునీటి సంఘాల అధ్యక్షులు వీరవల్లి శ్రీరాములు, ఉప్పలపాటి చక్రపాణి, కోలలపూడి అధ్యక్షులు తేలప్రోలు సుబ్బారావు, నాగరాజుపల్లి నీటి సంఘం అధ్యక్షుడు తాటి అంజనేయస్వామి, మార్టూరు మైనరు ఇరిగేషను ట్యాంకు (చెరువు)అధ్యక్షుడు కొనకంచి వెంకట్రావు తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్‌ను

పరామర్శించిన ఎమ్మెల్యే

మండలంలోని రాజుపాలెం మాజీ సర్పంచ్ జాష్టి గోపాలకృష్ణ (చినబాబు)ను ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరామర్శించారు. ఇటీవల నరసరావుపేట వద్ద జరిగిన కారు ప్రమాదంలో గోపాలకృష్ణ గాయపడి హైదరాబాద్‌లో చికిత్స పొంది రాజుపాలెం గ్రామానికి వచ్చారు. దాంతో అతని ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ జాష్టి వెంకటనారాయణ బాబు, సురేష్ పాల్గొన్నారు.

సిద్ధార్థరెడ్డి కుటుంబాన్ని

పరామర్శించిన ఏలూరి

చినగంజాం : పెదగంజాం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఆసోది బ్రహ్మారెడ్డి సోదరుడు పెద్ద సిద్ధార్థరెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం పెద్ద సిద్ధార్థరెడ్డి స్వగృహానికి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. సిద్ధార్థరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తుల సమస్యలపై ఆయన ఫోన్ ద్వారా పరిష్కరించారు. సర్పంచ్ నక్కల కృష్ణ, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాయకులు పొద వీరయ్య, అబ్దుల్ కలాంఅజాద్, సుబ్బారెడ్డి, టీవీ.రమణారెడ్డి, ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఏబీసీ కాలువపై బ్రిడ్జి

- తరచూ పడిపోతున్న వాహనదారులు
- తాజాగా కాలువలో పడిపోయిన బైకు
- నీటిలో కొట్టుకు పోతున్న వ్యక్తిని కాపాడిన బాటసారులు


ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

బల్లికురవ, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి బ్రాంచి కాలువపై ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. నిత్యం ఏదో ఒక సమయంలో కొత్త వ్యక్తులు మలుపు వద్దకు వచ్చి కాలువలో పడిపోతున్నారు. అద్దంకి వైపు నుంచి బల్లికురవకు వచ్చే క్రమంలో కాలువ వద్దకు వచ్చే సరికి మలుపు ఎంతో ప్రమాదకరంగా ఉందని కాలువపై ఉన్న బ్రిడ్జికి రక్షణ గోడలు లేకపోవటంతో కొత్త వ్యక్తులు రాత్రుళ్లు కాలువలో పడిపోతున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా పలు ప్రమాదాలు జరిగాయని అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. వెంటనే కాలువ మలుపు వద్ద గోడలను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మండల పరిధిలోని వల్లాపల్లి గ్రామ సమీపంలో ఉన్న అద్దంకి బ్రాంచి కాలువ 33వ మైలు వద్ద గుర్తు తెలియని బైకు కాలువలో పడిపోయింది. బైకు నీటిలో ఉండడం చూసిన బాటసారులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఆదివారం బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి కాలువ వద్దకు వచ్చి నీటిలో మునిగి ఉన్న మోటార్ బైకును బయటకు తీయించారు. బైకుకు నెంబర్ ప్లేట్ లేకపోవడంతో బైకు వివరాలను సేకరించారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. చీమకుర్తి మండలం కేవీపాలెం గ్రామానికి చెందిన ప్రతాప్ అనే వ్యక్తి బల్లికురవ గ్రానైట్ క్వారీల వద్దకు వచ్చి తిరిగి వెళుతుండగా ప్రమాదవశాత్తు మ లుపులో రోడ్డు అర్థంకాక శనివారం రాత్రి కాలువలో పడిపోయాడని వెంటనే బాటసారులు చూసి వెం టనే కండువాలతో నీటిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని రక్షించారు. వెంటనే బైకును అక్కడే వదిలి అతను వారి గ్రామానికి వెళ్లిపోయాడని, కాలువలో బైకు ఉండడం చూసిన ప్రజలు తమకు సమాచారం ఇవ్వగా బైకును బయటకు తీయించామని చెప్పారు.

బ్రిడ్జి వద్ద నెమ్మదిగా ప్రయాణించాలి

వల్లాపల్లి సమీపంలో ఉన్న అద్దంకి బ్రాంచి కాలువ బ్రిడ్జిపై వాహన చోదకులు నెమ్మదిగా ప్రయాణించాలి. రాత్రుళ్లు మలుపు వద్దకు వచ్చే సరికి కొందరు ప్రమాదాలబారిన పడుతున్నారు. అద్దంకి బల్లికురవ రోడ్డులో రాత్రుళ్లు వచ్చే వారు తగు జాగ్రత్తగా వాహనాలను నడపాలి. ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి.

- ఎస్ఐ జీవీ చౌదరి

సొంతింటి పనులకు పారిశుధ్య కార్మికులు

- రేపల్లెకి పంపించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్
- అతని తీరుపై సర్వత్రా విమర్శలు


రేపల్లెలో పనిచేస్తున్న మునిసిపల్ కార్మికులు, పక్కన వాహనం

చీరాలటౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : చీరాల శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. శానిటరీ కార్మికులు, మునిసిపల్ వాహనాన్ని రేపల్లె మునిసిపాలిటీ ఏడవ వార్డు అరవపల్లి రోడ్డులోని ఏకలవ్య విగ్రహం సమీపంలో ఆయన పాత ఇంటికి సంబంధించిన పనులకు రెండు రోజులు వినియోగించుకున్నారు. ప్రభుత్వ వాహనం, సుమారు 15 మంది కార్మికులను రేపల్లె పరిధిలో ఆయన పాత ఇంటి సామగ్రి తొగింపు కోసం వినియోగించడం దుర్మార్గమని అంటున్నారు. దీనిపై శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావును వివరణ కోరగా.. తన పాత ఇంటిలో దోషముందని, దీంతో నాన్న, అమ్మతో పాటు ఇటీవల తమ్ముడు మృతి చెందినట్లు చెప్పారు. తప్పని పరిస్థితుల్లో వారిని ఉపయోగించుకోవాల్సి వచ్చిందని చెప్పారు. ప్రభుత్వ వాహనం, కార్మికులను వాడకోవడం సరికాదని పలువురు విమర్శిస్తున్నారు.


కంటి పరీక్షలను పరిశీలిస్తున్న ఝాన్సీ

నేత్ర వైద్య శిబిరాల ఏర్పాటు అభినందనీయం

మంత్రి సతీమణి ఝాన్సీ

పంగులూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతమైన తూర్పు కొప్పెరపాడులో యువత ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని గొట్టిపాటి ఝాన్సీ అన్నారు. మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో పెండ్యాల వెంకటసుబ్బారావు (పండయ్య) స్మారకార్థం చేతన ఫౌండేషన్ సహకారంతో గొట్టిపాటి యూత్ ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్ సతీమణి గొట్టిపాటి ఝాన్సీ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించేందుకు వైద్య శిబిరాలు దోహదపడతాయని ఝాన్సీ తెలిపారు. ఈ శిబిరంలో శంకర్ నేత్రాలయం పెదకాకానికి చెందిన వైద్య బృందం 103 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 45 మందికి క్యాటరాక్ట్ చికిత్సలు అవసరంగా గుర్తించి, 18 మందిని చికిత్స నిమిత్తం శంకర్ కంటి వైద్యశాలకు తరలించారు. మిగిలిన వారికి మరో తేదీన తమ ఆసుపత్రిలో ఉచిత చికిత్సలు నిర్వాహిస్తామని డాక్టర్లు చెప్పారు. కార్యక్రమంలో గొట్టిపాటి యూత్ ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

పర్చూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : యోగా విద్యతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని సీనియర్ అధ్యాపకుడు బృందావనం లక్ష్మీనాథ్ అన్నారు. పర్చూరులోని శ్రీవేణు గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం చిన్నారులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యవంత మైన జీవితానికి యోగా ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం రామాయణ, మహాభారతంలోని పలు అంశాలను వివరించి వాటిలోని పలు ప్రశ్నలకు జవాబులు చెప్పిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు కఠారి సత్యనారాయణ, కొసనా వెంకటేశ్వర్లు, కాసా అజయ్ పాల్గొన్నారు.

బాలుర కబడ్డీ జిల్లా జట్టుకు ప్రాబబుల్స్ ఎంపిక

చినగంజాం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ఆవరణలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జూనియర్ బాలుర కబడ్డీ జట్టుకు ప్రాపబుల్స్‌ను ఆదివారం ఎంపిక చేసినట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్, అధ్యక్షుడు ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, కుర్రా భాస్కరావులు తెలిపారు. బాలుర జట్టు ఎంపికకు ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, కనిగిరి, పామూరు, కొత్తపట్నం, చీరాల, సంతమాగులూరు, చినగంజాం తదితర ప్రాంతాల నుంచి 50 మంది క్రీడాకారులు వచ్చినట్లు తెలిపారు. వీరిలో ప్రతిభ చూపిన 16 మంది క్రీడాకారులను జిల్లా బాలుర కబడ్డీ జట్టుకు ప్రాబబుల్స్‌గా ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీన తుదిజట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఎంపికైన జిల్లా బాలుర కబడ్డీ జట్టు ఈ నెల 22, 23, 24, 25వ తేదీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో జరిగే 50వ ఆంధ్రరాష్ట్ర అంతర్ జిల్లాల జూనియర్ బాలుర, బాలికల పోటీలలో పాల్గొనున్నట్లు తెలిపారు. ఇటీవల సంతనూతలపాడులో జరిగిన 71వ రాష్ట్ర అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలలో ప్రథమ స్థానం సాధించిన ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల కబడ్డీ జట్టుకు సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ రూ.75,000 నగదు బహుమతిని ప్రకటించారని తెలిపారు. ఎమ్మెల్యే అందజేసిన నగదు బహుమతిని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కరరావు, అసోసియేషన్ సభ్యులతో కలిసి జిల్లా జట్టుకు అందజేశారు. కబడ్డీ క్రీడకు ఎమ్మెల్యే అందిస్తున్న సహకారం మరువలేనిదని సభ్యులు అన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సిరిగిరి రంగారావు, ఈదర సురేష్‌బాబు, కోచ్ ఎం.గిరిబాబు, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు భోగిరెడ్డి సురేష్‌రెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి

మేదరమెట్ల, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలల్లో, పట్టణాలల్లో ప్రజలకు మెరుగైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తున్నట్లు అద్దంకి విద్యుత్‌శాఖ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని కుర్రవానిపాలెంలో రూ.2.3కోట్ల వ్యయంతో నూతన నిర్మించిన విద్యుత్ లైన్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొరిశపాడు మండలంలో ఇప్పటికే పమిడిపాడు, రావినూతల, సోమవరప్పాడు, మేదరమెట్ల, కొరిశపాడు గ్రామాల్లో విద్యుత్ సబ్ స్టేషన్‌లు పని చేస్తున్నాయన్నారు. రావినూతల సబ్ స్టేషన్ నుంచి కుర్రవానిపాలెం సబ్ స్టేషన్‌కు కొత్తగా నిర్మించిన విద్యుత్ లైన్ వలన నిరంతరం విద్యుత్ అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, సిబ్బంది, టీడీపీ నాయకులు నాదెండ్ల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సదుపాయాలేవి?

(5వ పేజీ తరువాయి)

దాదాపుగా లేదనే చెప్పాలి. పెట్రోల్ బంకుల వద్ద తాగునీటి వసతి కూడా ఉండాలి. కానీ నూటికి 90 బంకుల్లో ఈ సదుపాయమే లేదు. వేసవి కాలంలో సైతం కనీసం తాగునీటి సదుపాయాలు కల్పించకుండా నిర్వాహకులు దాటేస్తున్నారు. వాస్తవానికి బంకు నిర్వాహకుడు ఆర్వో యంత్రం, వాటర్ కూలర్, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాలి. కానీ ఎవరూ ఈ నిబంధనను పాటిం చడం లేదు. వినియోగదారులకు హక్కుగా అందాల్సిన ఆ సౌకర్యం లేకపో వడంతో నీళ్ల కొనుక్కుని దాహం తీర్చుకోవాల్సి వస్తోంది.

● ఫిర్యాదుల పెట్టె ఏది?


దాంతోపాటు ప్రతి పెట్రోలు బంకులో ఫిర్యాదుల పెట్టె, లేదా రిజిస్టర్ విని యోగదారులకు అందుబాటులో ఉంచాలి. పలు పెట్రోల్ బంకుల్లో కల్తీపెట్రోల్ అమ్ముతున్నారన్న ఫిర్యాదులు తరుచూ వినపడుతున్నా ఫిర్యాదుల పెట్టె లేకపోవడంతో వినియోగదారులు ఆ సౌకర్యాన్ని వాడుకోలేకపోతున్నారు. దీం తోపాటు ఇంధన నాణ్యతను పరిశీలించుకునే సదుపాయాన్ని కూడా బంకు ల్లోనే అందుబాటులో ఉంచాలి. వాటిని కూడా పెట్రోలు బంకు నిర్వాహకులు పాటించడంలేదు. గ్రామీణ ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల్లో కొన్నింటికి పైకప్పులు కూడా పూర్తిగా లేవు. ఇంధనం నింపుకోవడానికి వచ్చే వాహనదారులు ఎండలో, వానలో ఉండాల్సిన పరిస్థితి పలుచోట్ల కనిపిస్తోంది. వీటితోపాటు రోడ్డు ప్రమాదానికి గురైనవారికి అందుబాటులో ఉండేలా ప్రతి పెట్రోలు బంకులో ఒక ప్రథమ చికిత్స బాక్సు, ఒక టెలిఫోన్ ఉంచాలి. కానీ ఇవేవీ పెట్రోలు బంకు నిర్వాహకులు పాటించడం లేదు.

● పర్యవేక్షణ, తనిఖీలేవి?

పెట్రోల్‌బంకుల్లో సేవలపై సంబంధిత అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదు. తనిఖీలు కూడా చేయడం లేదు. పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారులు తమకు జరిగిన నష్టంపై ఆందోళన చేసినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్న అధికారులు ఆ తర్వాత అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, విజిలెన్స్ అధికారులు, ఇంధన సంస్థ అధికారులు తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవచ్చు. నిబంధనలు బేఖాతరు చేసేవారిపై జరిమానా విధించవచ్చు. బంకులను మూసివేయవచ్చు. కానీ గడిచిన ఐదేళ్లలో అలాంటి దాఖలాలు మచ్చుకు కూడా లేవు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాతైనా మార్పు వస్తుందా లేదా అన్నది చూడాల్సి ఉంది.

● అవగాహన లేమి.. అధికారుల బాధ్యతారాహిత్యం

పెట్రోల్‌బంకుల్లో విధిగా కల్పించాల్సిన సౌకర్యాలపై వినియోగదారులకు ఎవరికీ ఏమీ తెలియదంటే అతిశయోక్తి కాదు. ఈ విషయాలు వినియోగదారులకు తెలిపేలా ప్రభుత్వంగానీ, సంబంధిత అధికారులుగానీ కనీస చర్యలు తీసుకోకపోవడంతో వినియోగదారులు తమకు హక్కుగా రావాల్సిన సౌకర్యాలన్నింటినీ కోల్పోతున్నారు. వాస్తవానికి ఈ సౌకర్యాల కల్పనకు నిర్వాహకులు సొంత డబ్బులు ఖర్చు పెట్టేదేమీ ఉండదు. అది వినియోగదారుల నుంచి పన్నుల రూపంలో వసూలు చేసేదే. లీటరు పెట్రోల్ లేదా డీజిల్‌కు వినియోగదారుడు పెట్రోల్ బంకుల వారికి 4 నుంచి 6 పైసలు మరుగుదొడ్డు, మూత్రశాలల నిర్వహణ కోసం చెల్లిస్తున్నాడు. సగటున ఒక పెట్రోల్ బంకులో రోజుకు 10వేల లీటర్ల చమురు అమ్మితే టాయిలెట్స్ నిర్వహణ వ్యయం కింద ఆ బంకుకు వచ్చే ఆదాయం రోజుకు రూ. 500 కంటే ఎక్కువే ఉంటుంది. ఆ డబ్బుతో టాయిలెట్, మంచినీరు ఇతర సౌకర్యాలను అందించాల్సిన బాధ్యత పెట్రోల్ బంకులదే.





కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జేసీ కార్తీక్ తదితరులు

పొట్టిశ్రీరాములు త్యాగం
అజరామరం

- జాయింట్ కలెక్టర్ కార్తీక్ • ఘనంగా ఆత్మార్పణ దినం

నెల్లూరు (సాంస్కృతికం) డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు అమరజీవి పొట్టిశ్రీరాములు అని జాయింట్ కలెక్టర్ కార్తీక్ తెలిపారు. ఆదివారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినోత్సవంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మం బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రప టానికి జేసీ కార్తీక్, జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సమాచారశాఖ రూపొందించిన డాక్యుమెంటరీ వీడియోను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా జేసీ కార్తీక్ మాట్లాడుతూ తెలుగుజాతి కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం అజరామరమని తెలిపారు. అనంతరం ఆత్మకూరు జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులు ఆలపించిన దేశభక్తి గీతాలు అందరినీ అలరించాయి. జేసీ కార్తీక్, సంగీత ఉపాధ్యాయురాలు మల్లాది అనూషా తదితరులు విద్యార్థినులను అభినందించారు. 'పుణ్యభూమి నా దేశం.. నమో నమామీ' అనే సినీగీతాన్ని సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసులు విద్యార్థులతో కలిసి ఆలపించారు. కార్యక్రమంలో డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, సమగ్ర శిక్ష అభియాన్ ఏపీసీ ఉషారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

• పలువురి నివాళి



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న సోమిరెడ్డి తదితరులు

నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద గల పొట్టిశ్రీరాములు విగ్రహానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ అబ్దుల్ అజీజ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు పుష్పమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన త్యాగాలను స్మరించుకున్నారు. నగర మేయర్ స్రవంతి కూడా పొట్టిశ్రీరా ములు విగ్రహానికి పూలమాల వేసి ఆయన త్యాగాలను స్మరించుకున్నారు.

- నెల్లూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య నాయకులు పొట్టిశ్రీరాములు చిత్రపటాన్ని స్టోన్‌హౌస్‌పేట నుంచి ఊరేగింపుగా ఆత్మకూరు బస్టాండ్‌కు తీసుకువచ్చారు. అక్కడ పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివా ళులు అర్పించారు. ఈ సందర్భంగా పాండురంగ అన్నదాన సమాజం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర కార్యదర్శి పేగు షణ్ముఖరావు, కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ కోటగురుబ్రహ్మం, అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొండా ప్రవీణ్‌శంకర్, జిల్లా చాంబర్ ఆఫ్ కామర్స్ ట్రేడ్స్ అధ్యక్షుడు దాసా లక్ష్మీనారాయణ, నాయకులు బ్రహ్మంగుప్తా, ఆర్‌కేటీ శేష య్య, జనసేన నాయకులు నూనె మల్లికార్జున్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.
- జిల్లా గ్రంథాలయ సంస్థలో పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజా, పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ ఆడి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించిన ఎస్పీ కృష్ణకాంత్

లాఠీలు వదలి.. ఆటలాడారు !

- ఉత్సాహంగా పోలీస్ స్పోర్ట్స్ మీట్
- పరేడ్ మైదానంలో ఎస్పీ ప్రారంభం
- మూడు రోజుల పాటు పోటీల నిర్వహణ



కబడ్డీలో తలపడుతున్న పోలీసులు



డిస్క్‌త్రో ఆడుతున్న మహిళా కానిస్టేబుల్

నెల్లూరు(క్రైం),డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): యూనిఫాం ధరించి, చేతిలో లాఠీ పట్టుకొని నిరంతరం విధులు నిర్వహించే పోలీసు అధికారులు, సిబ్బంది క్రీడా దుస్తులు ధరించి మైదానంలో సరదాగా ఆటలాడారు. నెల్లూరు నగరంలోని పోలీసు పరేడు మైదానంలో ఆదివారం పోలీసు స్పోర్ట్స్ మీట్-2024ను ఎస్పీ జీ కృష్ణకాంత్ ప్రారంభించారు. మొదటగా కపోతాలను, బెలూన్లను గాల్లోకి ఎగురవేసి స్పోర్ట్స్ టార్చ్‌ను వెలిగించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ గెలుపోటములతో నిమిత్తం లేకుండా క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొనాలన్నారు. నిత్యం విధి నిర్వహణలో బిజీగా ఉండే పోలీసు సిబ్బందిలో స్పోర్ట్స్ మీట్ మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. క్రీడలతో చక్కటి ఆరోగ్యం చేకూరుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ స్పోర్ట్స్‌మీట్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొన్నారు. ఈ పోటీల్లో నెల్లూరు నగరం, నెల్లూరు రూరల్, ఆత్మకూరు, కావలి, కందుకూరు సబ్‌డివిజన్‌లతో పాటు ఏఆర్, హోంగార్డ్స్ విభాగాల్లోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. తొలిరోజు పరుగు పందెం, వాలీబాల్, షాట్‌పుట్, డిస్క్‌త్రో, లాంగ్‌జంప్ పోటీలు నిర్వహించారు. అధికా రులు, సిబ్బందితో కలిసి ఎస్పీ వాలీబాల్ ఆడి అందరిలోనూ క్రీడాస్ఫూర్తిని నింపారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన పురుష, మహిళా సిబ్బందికి మెడల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సీహెచ్ సౌజన్య, మునిరాజ్, డీఎస్పీలు డీ శ్రీనివాసరెడ్డి, ఘట్టమనేని శ్రీనివాస్, శ్రీధర్, ఏ శ్రీనివాసరావు, రాజగోపాల్, సీహెచ్ రామారావు, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



చలికి రక్షణగా ఉన్ని దుస్తులు ధరించి..

పొగమంచులో వాహనాల రాకపోకలు

అమ్మో.. చలి !

- పొగమంచు ప్రభావం ఎక్కువే • వైరస్ విజృంభించే అవకాశం
- వ్యాధుల బారిన చిన్నారులు, వృద్ధులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాను కొద్ది రోజులుగా చలి వణికిస్తుంది. గత ఏడాది ఇదే నెలలో 24 డిగ్రీలకే వణు కు పుట్టించిన చలి తీవ్రత.. ప్రస్తుతం 19 డిగ్రీలకు ఉష్ణోగ్రత చేరుకోవటంతో దీని ప్రభావంతో జిల్లా ప్రజలపై పడి, తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. రాపూరు, వెంకటగిరి, ఉదయగిరి మండలాలు అటవీ ప్రాంతాల్లోనూ, ఇందుకూరుపేట, విడవలూరు, టీపీ గూడూరు తదితర మండలాలు సముద్రం తీరం వెంబడి ఉండడంతో ఆయా మండలాల్లోని గ్రామాలపై చలి ప్రభావం ఎక్కువగానే ఉంది. దీనికితోడు పొగమంచుతో రహదారులు పూర్తిగా కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ చలితీవ్రత ఫిబ్రవరి వరకు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. రాత్రుళ్లే కాక పగటి పూట కూడా చలి తీవ్రత ఎక్కువగా ఉంటున్నది. ఈ క్రమంలో కొందరు స్వెర్టర్లు, టోపీలు, గ్లౌజులు, ఇతర ఉన్ని దుస్తులు ధరిస్తున్నారు సాయంత్రం 7 గంటల నుంచే చలి ప్రారంభమవుతోంది. తెల్లవారు జామున మంచు కారణంగా రహదారులపై వెళ్లాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఉదయం 9 గంటల వరకు మంచు వీడక పోవటంతో ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ, భవననిర్మాణ, ఇతర కూలీలు ఉదయం పనులకు వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారు.

చలి తీవ్రత ఇలా...

తేదీ	కనిష్ఠ	గరిష్ఠ
9	19.0	22.5
10	25.4	32.7
11	25.1	32.6
12	26.0	29.1
13	26.4	26.0
14	24.8	29.4
15	23.3	30.6

• వైరస్ ప్రభావం ఎక్కువే..

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే 98.6 డిగ్రీల ఫారన్‌హీట్ అవసరం. 96 ఫారన్‌హీట్‌కు ఉష్ణోగ్రత పడిపోయినా, 108కి పెరిగినా శరీరం తట్టుకునే పరిస్థితి లేదు. వృద్ధులు, చిన్నారులపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. చలి తీవ్రత కారణంగా రక్తం వెచ్చదనంగా మారి, శరీరం చెమటలు పడుతుంది. పాల్సీపారం, ఇన్‌ఫ్లూమెంజా వైరస్‌లు విజృంభించి దాడి చేస్తాయి. దీనివల్ల న్యూమోనియా సోకి ఊపిరితిత్తు లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. శరీరం లోని చేతి వేళ్లు, కాలివేళ్లు, చెవుల కొనలు వంటి భాగాలకు రక్తప్రసరణ ఆగి చర్మ వ్యాధులకు దారితీస్తుంది. ఫంగస్ సమస్య తలెత్తుతుంది. రోగ నిరోధక శక్తి సన్నగిల్లుతుంది. డస్ట్ , లంగ్ ఎలర్జీలు వస్తాయి. అత్యల్ప ఉష్ణోగ్రతలు కారణగా 60 ఏళ్లపైబడ్డ వృద్ధులకు, ఐదేళ్ల లోపు చిన్నారులకు తీవ్ర అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. దీనికి తోడు ప్రస్తుతం కరోనా వైరస్ ప్రభావం ఉండటంతో చలికాలంలోనే ఈ వైరస్ కూడా విజృం భించే అవకాశం ఉంది. ఈ కాలంలోనే బెల్స్ పాల్సీ అనే వైరస్ వ్యాప్తి చెందుతుండడంతో పక్షవాతాన్ని పోలే మూతి నొక్కుడు వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. మహిళల్లో హార్మోన్ల సమస్య అధిక మవుతుంది. మధు మేహం, థైరాయిడ్ వ్యాధి ఉన్న వారిపై చలి ప్రభావం ఎక్కువగా ఉంటుంది. చలి తీవ్రత వల్ల గుండె, ఊపిరితిత్తులకు రక్త ప్రసరణ సరిగా జరగక ప్రాణాపాయ పరిస్థితికి దారి తీస్తుంది. ఇక ఆస్తమా వ్యా.ధిగ్రస్థుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదం తప్పదంటూ వైద్యులు హెచ్చరిస్తున్నారు.

• అప్రమత్తత అవసరం

చలి నుంచి విముక్తి పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఉన్ని దుస్తులు ధరించడంతో పాటు మంకీ క్యాప్, స్వెర్టర్లు, శరీరం పూర్తిగా కప్పేలా దుస్తులు, కాళ్లకు సాక్సులు, చేతులకు గ్లౌజులు వేసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే వేడిచేసి చల్లార్చిన, గోరువెచ్చని నీటిని తాగాలని చెబుతు న్నారు. చలిలో బయట తిరగడం మంచిది కాదని వారు హెచ్చరిస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి



గత ఏడాది కంటే ఈ ఏడాదే చలి తీవ్రత ఎక్కువగా ఉంది. వృద్ధులు, చిన్నారుల పట్ల కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలి. వ్యాధులకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతాలలోనే కాకుండా పట్టణ ప్రాంతాల్లో చలి ప్రభావం ఎక్కువగానే ఉంది. పొగమంచు కారణంగా జాతీయ రహదారుల్లో వెళ్లే వాహన దారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ కృష్ణమూర్తి, అసోసియేట్ ప్రొఫెసర్, జీజీహెచ్

వైరస్ ప్రభావం చాలా ఎక్కువ



చలికాలంలోనే వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఊపిరితిత్తుల వ్యాధులతోపాటు ప్రాణాంతకమైన వ్యాధులకు గురయ్యే అవకాశం ఉంది. రక్తం సరఫరా తగ్గి గుండె, ఊపిరితిత్తుల వ్యాధులకు దారితీస్తుంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రాణాంతకమే. వైరస్‌కు గురికాకుండా మాస్కులు, శానిటైజర్లు వాడటం మంచిది.

- డాక్టర్ గంగాధర్, జనరల్ ఫిజీషియన్, జీజీహెచ్

'రూ.కోట్లు సంపాదించాం... అందులో కొంత ఖర్చు చేస్తే విచారణ నుంచి తప్పించుకోవచ్చు.... ఎవరూ భయపడాల్సిన అవసరం లేదు.. మేము విజిలెన్స్ అధికారులనే కాదు.. ఎమ్మెల్యేలకు దగ్గరగా ఉండే వ్యక్తులను కూడా మేనేజ్ చేస్తున్నాం... అందరూ తమ వంతుగా ఎంతోకొంత ఇవ్వండి'.... అంటూ హౌసింగ్ విభాగంలో కొందరు వ్యక్తులు దండకాలు మొదలుపెట్టారు. ఇప్పటికే అవినీతిలో భాగస్వాములైన పలువురు అధికారులు, ఉద్యోగుల వద్ద నుంచి నగదును వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఎంత ఖర్చయినా పర్వాలేదు కానీ, విజిలెన్స్ విచారణ నుంచి మాత్రం తప్పించుకోవాలి... అని అక్రమార్కులు శతవిధాలా ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఇంత ధైర్యంగా విజిలెన్స్ అధికారుల పేరుతో దండకాలు చేస్తుండడం హౌసింగ్ విభాగంలో చర్చనీయాంశంగా మారింది.

- డబ్బులివ్వండి.. విచారణ నుంచి తప్పిస్తాం...
- గృహనిర్మాణశాఖలో అక్రమార్కుల బరితెగింపు
- అవినీతిలో భాగస్వాముల నుంచి నగదు వసూళ్లు
- కీలకంగా వ్యవహరిస్తున్న కొందరు ఉద్యోగులు
- అక్రమాలు బయటపడుతుండడంతో గుబులు

'హౌసింగ్'లో
దండకాలు

నెల్లూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం హయాంలో హౌసింగ్ విభాగంలో అంతులేని అవినీతి జరిగింది. పేదల ఇళ్ల మాటున భారీ అక్రమాలు జరిగాయి. రూ.వందల కోట్ల ప్రజాధనం పక్కదారి పట్టింది. ప్రతీ లేఅవుట్‌లోనూ ఇళ్ల నిర్మాణం నాసిరకంగా జరిగింది. నాసిరకంగా నిర్మించడం ఒక ఎత్తయితే.. అసలు ఇళ్లు నిర్మించకుండానే బిల్లులు తినేయడం మరో ఎత్తు. ఇళ్ల నిర్మాణం చేయకుండానే లబ్ధిదారుడికి తెలియకుండా సిమెంటు, స్టీలు, నగదు డ్రా అయిపోయాయి. ఎప్పుడో నిర్మించిన ఇళ్లకు కూడా ఇప్పుడు కొత్త పథకంలో డబ్బులు తీసుకున్న సంఘటనలూ వెలుగు చూశాయి.

• పేదల ఇళ్లకు రూ. వెయ్యి కోట్లు

జిల్లాలో సుమారు రూ.వెయ్యి కోట్లను పేదల ఇళ్ల కోసం చెల్లించగా, కనీసం వెయ్యి ఇళ్లల్లో కూడా పేదలు నివాసం ఉండలేకపోతున్నారంటే ఆ ఇళ్లు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. వైసీపీ ప్రభుత్వంలో ఈ అవినీతిని పట్టించుకున్న నాథుడే లేడు. కళ్ల ముందు కనిపిస్తున్నా తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరించారు. అప్పట్లోనే అనేక ఫిర్యాదులు రాష్ట్ర ఉన్నతాధికారులకు అందాయి. వీటిపై జిల్లాలో విచారణ కూడా జరిగింది. చాలా చోట్ల అక్రమాలు జరిగినట్లు నిర్ధారించి హౌసింగ్ విజిలెన్స్ విభాగం నివేదికలు కూడా ఇచ్చింది. కానీ వాటి ఆధారంగా ఏ ఒక్కరిపై చర్యలు తీసుకోకపోగా ఆ తర్వాత కూడా పరిస్థితిని చక్కబెట్టలేదు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లుగా పేదల సొమ్మును పంచుకుతిన్నారు. అయితే నాడు ప్రతిపక్ష హోదాల్లో ఉన్న ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యేలు పేదల ఇళ్లల్లో జరిగిన అవినీతిని ప్రశ్నిస్తూ వచ్చారు. ఇదే క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ఇళ్ల నిర్మాణ పథకంలో జరిగిన అవకతవకలపై విజిలెన్స్‌కు విచారణకు ఆదేశించింది. విచారణ మొదలుపెట్టిన విజిలెన్స్ అధికారులు అనేక అక్రమాలను గుర్తించారు. గోదాముల్లో ఉన్న నిల్వలకు, పేమెంట్ వివరాలకు మధ్య భారీ వ్యత్యాసాన్ని గుర్తించా రు. ఇందుకు బాధ్యు లుగా జిల్లాలోని ఇంజ నీరింగ్ అసిస్టెంట్లకు నోటీసులు పంపేలా చేశారు. ఇక్కడే సుమారు రూ.100 కోట్లకుపైగా అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఇక హౌసింగ్ అధికారులు రికార్డుల్లో రాసు కున్నట్లుగా నిజంగానే లబ్ధిదా రులకు బిల్లులు అందాయా..? అన్న వివరాలను విచారిస్తే మరిన్ని అవకతవకలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. అదే కాకుండా ఇళ్ల నాణ్యతపై కూడా విచారణ జరిపితే ఏ స్థాయిలో అవినీతి జరిగిందో బట్టబయల వుతుంది. విజిలెన్స్ విచారణ మరింత లోతుగా జరిగితే ఈ అక్రమ వ్యవహారాలన్నీ వెలుగులోకి వచ్చే అవకాశముండడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు రేగింది.

• విచారణను అడ్డుకునేందుకు కుట్రలు

ఈ నేపథ్యంలో ఎలాగైనా విజిలెన్స్ విచారణను అడ్డుకునేందుకు హౌసింగ్‌లోని అక్రమార్కులు కుట్రలు పన్నుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల గుంపులు గుంపులుగా ఎమ్మెల్యేల వద్దకు పరుగులు తీశారు. వైసీపీ నాయకుల ఒత్తిళ్లతో తప్పులు చేయాల్సి వచ్చిందంటూ చెప్పుకున్నారు. కానీ ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడంతో ఇప్పుడు మరోమార్గంగా నగదుతో మేనేజ్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవలే విజిలెన్స్ విచారణ అంశంపై రహస్య సమావేశం పెట్టుకున్న అక్రమార్కులంతా.. డబ్బులు దండి మేనేజ్ చేసుకోవాలని తీర్మానించుకున్నట్లు ఆ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కొందరు ఉద్యోగులు ఇందులో కీలకంగా వ్యవహరిస్తూ వసూళ్లు మొదలుపెట్టినట్లు తెలుస్తోంది.

- రాళ్లపాడు వద్ద రైతుల ధర్నా
- దెబ్బతిన్న కుడి కాలువ గేటు పైకిలాగి నీళ్లు ఇవ్వండి
- లేకుంటే పురుగుమందు తాగుతానన్న రైతు
- ఇసుకపాలెం వద్ద దిగువకు నీరు వెళ్లకుండా అడ్డుకట్ట



రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ తూము వద్ద రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

నారు, నాట్లు ఎండుతున్నాయ్...
ఆయకట్టుకు నీరివ్వండి

లింగసముద్రం, డిసెంబరు 15: మండలంలోని రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద ఆదివారం ఆయకట్టు రైతులు ధర్నా నిర్వహించారు. కుడి కాలువ తూము వద్ద ఎదురుగా ఉన్న రోడ్డుపై కూర్చొని వాహనాల రాకపోకలను నిలిపి వేశారు. మధ్యా హ్నం ఒంటి గంట సమయంలో చినపవని, పెదపవని, మేదరమెట్లపాలెం, భీమవరప్పాడు గ్రామాల ఆయకట్టు రైతులు ప్రాజెక్టు వద్దకు చేరుకుని దెబ్బతిన్న గేటు గురించి మెకానిక్ షమీం బాషాను అడిగారు. గేటు పైకి లాగేందుకు ప్రయత్నిస్తున్నానని, అది వచ్చేటట్టు లేదని ఆయన చెప్పారు. ముందు చేస్తామని చెప్పి, ఇప్పుడు వీలు పడదంటే ఎలా..? అని రైతులు ప్రశ్నించారు. నా చేతనైన మేరకు చేస్తున్నానని బాషా వారికి చెప్పారు. దీంతో 50 మందికిపైగా రైతులు ఆగ్రహావేశాలతో రోడ్డుపైకి వచ్చి మోటారు సైకిళ్లను అడ్డుపెట్టి ధర్నాకు దిగారు.



ఆత్మహత్యకు పాల్పడుతా...
ధర్నాలో పురుగు మందు డబ్బాతో రైతు

• పంటలు ఎండుతున్నాయి.. ఆదుకోండి

ఇప్పటికే పోసిన వరినార్లు, నాటిన వరినాట్లు ఎండిపోతున్నాయని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.తీవ్ర నిర్లక్ష్యానికి గురైన రాళ్లపాడు ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని, కుడి కాలువకు నీటిని విడుదల చేయాలని వారు నినాదాలు చేశారు.అధికారుల వైఫల్యం వల్లే ఇలా జరిగిందని వారు ఆరోపించారు.గత 9రోజుల క్రితం దెబ్బతిన్న గేటు వల్ల నీటి సరఫరా సరిగా జరక్క తాము తీవ్రంగా నష్టపోయా మని, ఆదుకోవాలని వారు కోరారు.ఈ సందర్భం గా ఓ రైతు మాట్లాడుతూ ఆయకట్టుకు వెంటనే నీరివ్వకుంటే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడతానని అధికారులను హెచ్చరించారు.

• కుడికాలువపై అడ్డుకట్ట

మూడు రోజుల క్రితం గేటును కొద్దిగా పైకి లాగి 80 క్యూసెక్కుల నీటిని కాలువలోకి వది లారు. అయినా ఈ కాలువ దిగువన ఉన్న ఇసుకపాలెం వద్ద రైతులు నీరు దిగువకు వెళ్లకుండా కాలువకు అడ్డుకట్ట వేశారని రైతులు చెప్పారు.వారు ఆ నీటిని తమ పొలాలకు పెట్టుకుంటున్నారని తెలిపారు. దీంతో దిగువకు నీరు రాకపోవడంతో తమ పంటలు ఎండిపోతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

• నిలిచిన వాహనాల రాకపోకలు

ధర్నాతో లింగసముద్రం-కొత్తపేట మార్గంలో సుమారు నాలుగుగంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.విషయం తెలుసుకున్న వలేటివారిపాలెం, కందుకూరు, కొండాపురం ఎస్ఐలు,పోలీసు సిబ్బంది వాహనాలను వదలాలని రైతులకు నచ్చచెప్పినా వారు వినిపించుకోలేదు. సాయంత్రం 5.30 గంటలకు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కందుకూరు టీడీపీ నాయకులు గుర్రం మాల్యాద్రి, వడ్లమూడి సురేష్‌లు ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి గేటును పైకి లాగేందుకు ప్రయత్నించారు.అయితే గేటు పైకి లేవలేదు. గేటు లాగేందుకు తాము తెచ్చిన 14 టన్నుల గల పుల్లీల సామర్థ్యం చాలదని, 50 టన్నుల సామర్థ్యం కావాలని చెప్పి వారు వెళ్లిపోయారు. దీంతో రైతులు కూడా ధర్నాను విరమించారు. పోలీసులు సాయంత్రం 6 గంటలకు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలి : సీపీఎం



సమావేశంలో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

ఉదయగిరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కటారి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో నాయకులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ హయాంలో మద్యపాన నిషేధం వల్ల కుటుంబాలు బాగుపడ్డాయన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీధికో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో పాటు గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తోందని, దీంతో పేదలు మద్యానికి బానిసలవుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేస్తే పగలగొట్టాలని లోకేష్ పాదయాత్రలో పేర్కొన్నాడని, ప్రస్తుతం విద్యుత్ చార్జీలు విపరీతంగా పెంచడంతో గతంలో రూ.200 వచ్చే బిల్లు ప్రస్తుతం రూ.400 అయ్యిందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. పేరుకే ఉచిత ఇసుకన్నారు. ఫిబ్రవరి 1, 2, 3వ తేదీల్లో నెల్లూరులో నిర్వహించే ఆంధ్ర రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం నేతలు కాకు వెంకటయ్య, కోడె రమణయ్య, ఫరుద్దీన్‌బాషా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

కావలి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పాలిట ఆపద్బాంధవుడు చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ముసునూరు రైల్వేగేట్ సమీపంలోని మైదానంలో దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ఘనంగా జరిగింది. హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, టీడీపీ దివ్యాంగుల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు మండవ వెంకట్రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దివ్యాంగుల అభివృద్ధి సంక్షేమానికి కట్టుబడి వున్నారని తెలిపారు. దివ్యాంగులందరికీ నివాసాలు కల్పించేలా తాను చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గృహాలు నిర్మించుకునే వారికి రూ.10వేలు అందజేస్తానని తెలిపారు. మండవ వెంకట్రావు పోరాట పటిమ గొప్పదని ఆయన దివ్యాంగులకు అందించిన సేవలను కొనియాడి సత్కరించారు. కార్యక్రమంలో వేదిక నాయకులు మహబూబ్‌బాష, సోమయ్య, శ్రీను సలహాదారుడు నటరాజ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

అల్లూరు : రోడ్డు ప్రమాదంలో మరణించిన నార్తుఆములూరు టీడీపీ నాయకుడు శిగినం తిరుపతి కుటుంబసభ్యులను ఆదివారం ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి పరామర్శించారు. అన్నివిధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, ఊటు అశోక్‌రెడ్డి, గుంజి రుద్రయ్య, దాసరి ప్రభాకర్, కరుణాకర్, పెయ్యల బాస్కర్, బాబు, గుంజి మల్లికార్జున, ఎందేటి హరికృష్ణ యాదవ్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

'చలో గుంటూరు'కు మాల మహానాడు శ్రేణులు



కావలి టౌన్: గుంటూరుకు బయలుదేరుతున్న మాల మహానాడు కార్యకర్తలు

కావలి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా గుంటూరులో తలపెట్టిన హలో మాల- చలో గుంటూరు కార్యక్రమానికి ఆదివారం కావలి నుంచి మాలమహానాడు ఆధ్వర్యంలో సభ్యులు పెద్దఎత్తున తరలివెళ్లారు. కార్యక్రమంలో మాలమహానాడు డివిజన్ అధ్యక్షులు ఎల్లంటి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి మేడికొండ సుకుమార్, మాల ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఆనందరావు ఉన్నారు.

● జలదంకి : గుంటూరులో ఆదివారం నిర్వహిస్తున్న మాలల సింహగర్జనకు మండలంలోని మాల కులస్థులు ప్రత్యేక వాహనాలలో తరలివెళ్లారు. ముందుగా వీరు జమ్మలపాలెం నుండి 400మంది ర్యాలీగా ముందుకు వెళుతుండగా అనంతరం మాజీసర్పంచ్ నక్కా మాధవరావు వాహనాలకు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఉలవపాడు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరేడు పంచాయతీ అలగాయపాలెం కొత్తరెడ్డిపాలెంలోని ప్రసన్నాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠకు ఆదివారం నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎంపీ, ఎమ్మెల్యేలకు సాదర స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. ఉలవపాడు నుంచి అలగాయపాలెం వచ్చే రోడ్డు వద్ద రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం, ఉలవపాడు రైల్వే స్టేషన్‌లో సూపర్ ఫాస్ట్‌లు నిలిపేలా కృషి చేయాలని ప్రజలు ఎంపీ వేమిరెడ్డికి విన్నపించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకన్నకు వైభవంగా గరుడసేవ



గరుడ వాహనంపై ఆశీనుడైన ప్రసన్న వేంకటేశ్వరస్వామి

బిట్రగుంట, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంపై వెలసిన ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆదివారం రాత్రి గరుడ వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. కావలి బులియన్ మార్కెట్ అధ్యక్షులు మొగలపల్లిరాజు, మిత్రబృందం ఉభయ కర్తలుగా వ్యవహరించారు. ఆలయ అర్చకులు సత్యనారాయణ చార్యులు, కళ్యాణాచార్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సేవను తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో ఈవో రాధాకృష్ణ, మాజీ పాలక మండలి సభ్యులు తులసీరాం, ఆలయ సిబ్బంది ఉన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్లలో ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం పౌర్ణమి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది.

రాజరాజేశ్వరిదేవి ఆలయంలో పౌర్ణమి పూజలు



హోమంలో పూర్ణాహుతి వేస్తున్న అర్చకులు

సంగం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిరుమనకొండలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి జ్ఞానపీఠంలో పీఠాధిపతి రాజరాజేశ్వరానందస్వామి ఆధ్వర్యంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మ వార్లకు లలిత క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించారు. అనంతరం హోమం ఏర్పాటుచేసి పూర్ణాహుతి సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



కావలి: పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, కూటమి, ఆర్యవైశ్య నేతలు



కందుకూరు : పొట్టిశ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి, తదితరులు

తెలుగువారి ఆత్మగౌరవం పొట్టి శ్రీరాములు

● జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు పొట్టి శ్రీరాములు పేరు ప్రతిపాదన ● ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవం కోసం పోరాడిన వ్యక్తి అమరజీవి పొట్టి శ్రీరాములు అని, ఆయన ఆత్మత్యాగం, బలిదానం ఫలితంగా ప్రత్యేక రాష్ట్ర గుర్తింపు వచ్చిందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. ఆదివారం పొట్టిశ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని పట్టణ ట్రంకు రోడ్డులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్య మండల అధ్యక్షుడు తటవర్తి రమేష్‌తో పాటు సభ్యులతో కలిసి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన ఆత్మార్పణ దినం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరజీవి వర్ధంతిని పొట్టిశ్రీరాములు ఆత్మార్పణ దినంగా ప్రకటించి ప్రభుత్వ కార్యక్రమంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌కు పొట్టిశ్రీరాములు పేరుపెట్టాలనే ప్రతిపాదనను త్వరలో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. అలాగే కావలి ట్రంకురోడ్డుకు మాగుంట పార్వతమ్మపేరుతో త్వరలో జీవో రానుందన్నారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోట్లూరు శ్రీనివాసులు, మొగిలి కల్లయ్య, బీజేపీ నాయకులు కందుకూరి వెంకట సత్యనారాయణ, సీపీసీ సత్యం, బహ్మానందం, జనసేన నేతలు అళహరి సుధాకర్, పొబ్బా సాయి విఠల్, ఏరియా వైద్యశాల డైరెక్టర్ చవల రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

● బిట్రగుంట: జువ్వలదిన్నెలోని ఆయన స్మారక భవనంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బోగోలు మండల తహసీల్దారు సురేష్‌బాబు, కార్యదర్శి పురిణి శ్రీనివాసులు, పొట్టిశ్రీరాములు కమిటీ అధ్యక్షులు తిరువీధి ప్రకాశరావు, సభ్యులు ఎం.నాగేశ్వరావు, పసుమర్తి నాగరాజు ఉన్నారు. అనంతరం పర్యాటక కేంద్ర ఆవరణలోని పొట్టిశ్రీరాములు కాంస్య విగ్రహానికి ఇస్కపల్లి కెనాల్ అధ్యక్షులు బీద గిరిధర్‌యాదవ్, జువ్వలదిన్నె చెరువు అధ్యక్షులు కోట వెంకారెడ్డి, ఉపాధ్యక్షులు పులికొండలరావు, టీడీపీ నేతలు బడుగు వెంకయ్య, గునిమిని రవికుమార్‌రెడ్డి, కడియాల చిన గోవిందులు పూలమాలు వేసి నివాళులర్పించారు.

●అల్లూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకొని స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం డీటీ ప్రవీణ్‌కుమార్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వీఆర్వో భారతి, సర్వేయర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

● కందుకూరు : నియోజకవర్గ ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కందుకూరు, గుడ్లూరులో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినంగా ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి నియోజకవర్గం ప్రజల తరుపున దన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, ఆర్యవైశ్య నాయకులు తాతా లక్ష్మీనారాయణ, మురారిశెట్టి సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●ఉలవపాడు : ప్రత్యేక రాష్ట్రం కోసం తన ప్రాణాలను ఆత్మార్పణ చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములును స్మరించుకోవడం తెలుగుజాతి గర్వించదగిన అంశమని ఆర్యవైశ్య మండల అధ్యక్షులు పోకూరి శ్రీధర్ అన్నారు. ఆదివారం ఉలవపాడు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బావనపల్లి సుబ్రహ్మణ్యం, పైడిమర్రి సత్యన్నారాయణ, మేడా శ్రీనివాసులు, రామాంజేయులు పాల్గొన్నారు.

●ఆత్మకూరు: అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్‌చైర్మన్ షేక్ సర్దార్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కేతా విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు సూరా భాస్కర్‌రెడ్డి, షేక్ గౌస్‌బాష, గందళ్ల వేణు, టీడీపీ నేతలు కొప్పోలు చిన్నపురెడ్డి, మున్సిపల్ ఏఈ డి మాధవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక ఉప రవాణా శాఖ కార్యాలయంలో ఎంవీఐ రాములు, సిబ్బంది, పలువురు వాహనదారులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సత్రంసెంటర్ వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి పలువురు ఆర్యవైశ్య నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. రాష్ట్ర అవతరణ కోసం పొట్టిశ్రీరాములు చేసిన సేవలను కొనియాడారు.

● సంగం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు గిరి, రాజ, వేమా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

● చేజర్ల : మండల కేంద్రమైన చేజర్లలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టిశ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. బస్టాండులో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పువ్వాడి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నేత రావి పెంచలరెడ్డి, బీజేపీ నేత బత్తల కిష్టయ్యలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రావు, సుధాకర్, దేవతి సుబ్బారావ పాల్గొన్నారు.

● ఉదయగిరి : పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా స్థానిక మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి, అధ్యాపకులు రమేష్, దుర్గాప్రసాద్, గోపికృష్ణ, రఘునాథ్‌రెడ్డి, కిషన్‌తేజ, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: మున్సిపల్ కార్యాలయంలో పొట్టిశ్రీరాముల చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు, టీడీపీ నేతలు



ఉదయగిరి: పొట్టిశ్రీరాముల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

నేడు గంధ మహోత్సవం



గంధ మహోత్సవానికి ముస్తాబైన దర్గా

ఉదయగిరి, డిసెంబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో ఉన్న దుర్వేష్‌ఔలియా గంధ మహోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దర్గా నుంచి బాణసంచా పేలుళ్ల నడుమ పట్టణ పురవీధుల్లో గంధం ఊరేగింపు చేపట్టి తిరిగి దర్గాకు చేరుతుందన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు పంచిపెట్టడం జరుగుతుందన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కోల్డ్ స్టోరేజ్ ప్రారంభం



కోల్డ్ స్టోరేజ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు కాకర్ల, ఉగ్ర

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన కోల్డ్ స్టోరేజ్‌ను ఆదివారం ఉదయగిరి, కనిగిరి ఎమ్మెల్యేలు కాకర్ల సురేష్, ఉగ్ర నరసింహారెడ్డిలు ప్రారంభించారు. ఈసందర్భంగా కాకర్ల మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతాల్లో ఇలాంటి అవకాశం కల్పించడం అభినందనీయమని, ఈప్రాంత రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2047 విజన్‌తో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. కురిసిన వర్షాల నేపథ్యంలో నియోజకవర్గంలోని చెరువులు నిండి రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటుకు తాను ముందుంటానని హామీనిచ్చారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

19న ఉప్పలపాడు నల్లచెరువుకు బహిరంగ వేలం

అనంతసాగరం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పలపాడులో గల నల్లచెరువుకు ఈనెల 19న బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ పూరిబిండి ప్రశాంతి, పంచాయతీ కార్యదర్శి పి అరుణ్‌కుమార్ ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. 1434 ఫసలి ప్రకారం వేలంపాటలో పాల్గొనేవారు రూ. 10000 చెల్లించి పాల్గొనాలని పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఉప్పలపాడు సచివాలయంలో వేలంపాట జరుగుతుందని తెలిపారు.

మృత్యుకుహరంలా సంగం - పల్లిపాళెం రహదారి

● కాలువ తూములు కుంగి గుంతలు ● ప్రమాదకరంగా మలుపులు ● వాహనదారుల అవస్థలు



కాలువ రక్షణ గోడ దెబ్బతిని కోతకు గురైన పల్లిపాళెం రహదారి



రోడ్డుపై రాకపోకలకు తాత్కాలికంగా వేసిన ఇసుక బస్తాలు

సంగం, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగం - పల్లిపాళెం రహదారి మృత్యుకుహరంగా మారింది. ఈ రహదారిపై తరుచూ ప్రమాదాలు జరుగుతున్నా గత వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకున్న నాథుడే లేడని ప్రజలు, వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సంగం ఇరిగేషన్ ఆనకట్ట నుంచి నెల్లూరు - ముంబయి రహదారికి సమాంతరంగా పల్లెపాళెం మీదుగా బైపాస్ రహదారి ఉంది. ఈ రోడ్డు గాంధీజన సంఘం వద్ద నెల్లూరు జాతీయ రహదారిలో కలుస్తుంది. పొదలకూరు, చేజర్ల నుంచి బుచ్చి వైపు వెళ్లే వాహనదారులకు ఈ రోడ్డు బైపాస్ రోడ్డుగా ఉంది. ఈ రహదారి పంచాయతీరాజ్ ప్రాజెక్టు పరిధిలో ఉంది. మండల కేంద్రానికి తూర్పు వైపున ఉన్న గ్రామాలు వెంగారెడ్డిపాళెం, పడమటిపాలెం, గాంధీజనసంఘం, సిద్దీపురం, దువ్వూరు గ్రామాలకు సంగం వచ్చేందుకు బైపాస్ రహదారిగా ఉపయోగపడుతోంది. లారీలు, బస్సుల రాకపోకలతో ముంబయి రహదారి రద్దీగా ఉండడంతో ఆత్మకూరు, పొదలకూరు వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులు, అదేవిధంగా పొదలకూరు, ఆత్మకూరు, సంగం నుంచి బుచ్చి వైపు వెళ్లే ద్విచక్ర వాహనదారులు, కార్లు పల్లిపాళెం బైపాస్ రహదారి మీద రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉంది. దీంతో ఎక్కువగా ద్విచక్ర వాహనదారులు బైపాస్ రహదారి మీదనే రాకపోకలు సాగిస్తున్నారు.

● కుంగిన కాలువ తూములు

ఈ రహదారి నిర్మించి పదేళ్లు కావడం, గత వైసీపీ ప్రభుత్వం నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో ఈ రహదారిలో ఉండే పలు కాలువల తూములు కుంగి గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో ఓ ఆటో ఈ గుంతల్లో పడి అదుపుతప్పి కాలువలో పడింది. కాలువలో తక్కువ పరిమాణంలో నీరు ఉండడంతో ప్రమాదం తప్పింది.

● ప్రమాదకరంగా మలుపులు

రహదారిలోని పలు కాలువలపైన ఉన్న రక్షణ గోడలు దెబ్బతిని ప్రమాదకరంగా ఉన్నాయి. ఐదు కిలోమీటర్ల ఈ రహదారిలో 8 చోట్ల ఎస్ ఆకారంలో ఉన్న మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ మలుపుల్లో సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు వేగంగా వస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నారు.

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు

● అప్పాజీ, ఎంపీడీవో, ఉదయగిరి



ఉదయగిరి, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంతో పాటు మండలంలో 17 పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో అప్పాజీ ఆదివారం తెలిపారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేస్తున్నామని, చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నామన్నారు.

? వాటర్‌ట్యాంకుల్లో క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నారా.

!: వాటర్‌ట్యాంకుల్లో ప్రతి 15 రోజులకోసారి క్లోరినేషన్ చర్యలు చేపడుతున్నాం.

? హౌస్‌హోల్డ్ సర్వే పూర్తయిందా.

! మండలంలో హౌస్‌హోల్డ్ సర్వే దాదాపు పూర్తయింది. ఈ సర్వే ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయి.

? చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొస్తారా.

! మండలంలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఉన్నతాధికారుల ఆదేశాలతో ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపడతాం. ఇప్పటికే పలు పంచాయతీల్లో కేంద్రాలను ఉపయోగంలోకి తీసుకొచ్చాం.

న్యూస్ బాక్స్

మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

సీతారామపురం,డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బసినేనిపల్లి గ్రామ పంచాయతీలోని ఎసి నగర్ యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగా టీడీపీ నాయకులు గోవిందు నాగయ్య, గోవిందు రత్నం సహకారంతో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం మాజీ జడ్పీటీసీ కల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి, బసినేనిపల్లి టీడీపీ ఇన్‌చార్జ్ బద్వేల్ రమణారెడ్డిలు రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం కల్లూరు వెంకటేశ్వర్లురెడ్డి బోలింగ్ వేయగా బద్వేల్ రమణారెడ్డి బ్యాటింగ్ చేస్తూ క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమిలిపోగు ఏసుదాస్, మౌలయ్య, మాలకొండయ్య ఆర్గనైజింగ్ సభ్యులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

శాకాహారంపై అవగాహన ర్యాలీ

వింజమూరు, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీవేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ శైలజ పాల్గొని జీవుడు, దేవుడు, భగవంతుడు గూర్చి చక్కటి ఉదాహరణలతో శాస్త్రీయంగా వివరించారు. ఈ నెల 21 నుంచి 31 వరకు రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో జరుగు పత్రీజీ ధ్యాన మహాయాగానికి అందరూ హాజరు కావాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం శాకాహారం గొప్పతనం గురించి కరపత్రాలు పంచుతూ పిరమిడ్ నగర్, చెన్నకేశవస్వామి బజార్, ఎర్రబెల్లిపాలెం, ప్రధాన రహదారుల మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కనిగిరి పిరమిడ్ మాస్టర్ లింగారెడ్డి, ధ్యానులు పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న లావణ్య

చిన్నారులకు దుస్తుల పంపిణీ

కావలి టౌన్, డిసెంబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కచ్చేరిమిట్టలో ఆదివారం మీకోసం సేవాసంస్థ సభ్యులు బ్లెస్డ్ హోమ్ పిల్లలకు క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు దిలీప్, దాసు, డేనియల్ బాబ్జి, అడ్వకేట్ శివకృష్ణ, అంకప నాయుడు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు, చీరలు..



చీరలు అందజేస్తున్న ప్రభాకర్

గుడ్లూరు, డిసెంబరు 15: మూర్తింపేట గిరిజనకాలనీని 50మంది పేద కుటుంబాలకు ఆదివారం పీపుల్ హెల్పింగ్ హాండ్స్ సోసైటీ సభ్యులు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు తలకాయల ప్రభాకర్, హేమలత, మాదేష్, సంజయ్ గ్రామపెద్దలు ఉన్నారు.